ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



అనకాపల్లి
జిల్లా వార్తలు


శనివారం 9 ఆగస్టు 2025



వంజంగిలో గిరిజనులతో సీఎం ముచ్చటించే ప్రదేశంలో జరుగుతున్న ఏర్పాట్లు

నేడు సీఎం చంద్రబాబు రాక

ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అడవి బిడ్డలతో మమేకం



- వంజంగిలో గిరిజన సంప్రదాయాలపై స్థానికులతో మాటామంతీ
- కాఫీ తోటల్లో గిరిజన రైతులతో ముఖాముఖి
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దార్

పాడేరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అడవి బిడ్డలతో మమేకం అయ్యేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం పాడేరు రానున్నారు. మండలంలోని వంజంగి, లగిశపల్లి గ్రామాల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి ఆదివాసీ దినోత్సవంలో ఆయన పాల్గొంటారు. ఇక్కడ గిరిజనులతో మమేకమై వారి ఆచారాలు, సంప్రదాయాలను తెలుసుకోవడంతోపాటు, కాఫీ, మిరియాల పంటల సాగు ద్వారా కలుగుతున్న ఆర్థిక ప్రయోజనాల గురించి గిరిజన రైతులను అడిగి తెలుసుకుంటారు. ఇదే సమయంలో గిరిజనుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటారని భావిస్తున్నారు.

చంద్రబాబు పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు

ఆదివాసీ దినోత్సవ నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ శుక్రవారం పర్యవేక్షించారు. లగిశపల్లి సమీపంలో హెలీప్యాడ్, సభా వేదిక, వంజంగి గ్రామంలో, సమీపంలోని కాఫీ తోటల్లో గిరిజన రైతులతో సీఎం ముచ్చటించే ప్రదేశాలలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీ అమిత్‌బర్దార్... హెలీప్యాడ్ నుంచి వంజంగి, లగిశపల్లి గ్రామాలకు ప్రత్యేక వాహనంలో సీఎం రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు వంటి చర్యలను పర్యవేక్షిస్తున్నారు. పాడేరు పట్టణంతోపాటు వంజంగి, లగిశపల్లి వెళ్లే మార్గాల్లో భారీగా పోలీసులను ... మిగతా 8వ పేజీలో

జలాశయం కబ్జా

పాపయ్యపాలెం రిజర్వాయర్‌లో 30 ఎకరాలు ఆక్రమణ

- మూడేళ్ల క్రితం 15 ఎకరాల్లో సరుగుడు సాగు
- తాజాగా మరో 15 ఎకరాలు ఆక్రమణ
- సరుగుడు మొక్కలు వేసేందుకు భూమిని సిద్ధం చేసిన అక్రమార్కులు
- రైతుల ఫిర్యాదులను పట్టించుకోని రెవెన్యూ అధికారులు



జలాశయం భూమిని ఆక్రమించి, సరుగుడు మొక్కలు వేయడానికి సిద్ధం చేసిన కబ్జాదారులు

మాకవరపాలెం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములనే కాకుండా పొలాలకు సాగునీటిని అందించే జలాశయాల భూములను సైతం కొంతమంది ఆక్రమించేస్తున్నారు. .మండలంలోని పాపయ్యపాలెంలో జలాశయం భూమిలో ఎత్తుపల్లాలను సరిచేసి, ట్రాక్టర్లతో దున్ని, సరుగుడు తోటలు వేయడానికి సిద్ధం చేస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు.

మండలంలోని పాపయ్యపాలెం సుమారు 90 ఎకరాల విస్తీర్ణంగా రిజర్వాయర్ ఉంది. దీని నుంచి పాపయ్యపాలెం, బుచ్చన్నపాలెం, మునిడిపాలెం గ్రామాలకు చెందిన సుమారు 500 ఎకరాలకు ఏటా ఖరీఫ్ సీజన్‌లో నీరు సరఫరా అవుతుంది. ఇదిలావుండగా కొన్నేళ్ల నుంచి స్థానికంగా రాజకీయ ఆధిపత్యం చెలాయించే కొంతమంది వ్యక్తులు, ఈ జలాశయం లోపలవైపు, చుట్టూ వున్న భూమిని ఆక్రమించుకుంటున్నారు. గత టీడీపీ హయాంలో రైతుల ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి, ఆక్రమణలను తొలగించారు. ఇదే సమయంలో సుమారు రూ.70 లక్షలు ఖర్చుచేసి, మదుముతోపాటు పంట కాలువలను అభివృద్ధి చేశారు. ఆరేళ్ల క్రితం వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ రిజర్వాయర్ భూమిలో ఆక్రమణలు మొదలయ్యాయి. నాలుగేళ్ల క్రితం సుమారు 15 ఎకరాలను చదును చేసిన సరుగుడు మొక్కలు వేశారు. ప్రస్తుతం ఇవి తోటలుగా ఎదిగాయి. నాలుగైదేళ్లపాటు సరుగుడు తోటలను పెంచితే, ఖర్చులు పోను ఎకరాకు మూడు నుంచి నాలుగు లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తున్నది. మొక్కలు నాటి, ఏడాది పాటు సంరక్షించడం మినహా పెద్దగా ఖర్చు వుండదు.

దీంతో తాజాగా మరో 15 ఎకరాలను ఆక్రమించి యంత్రాలతో ఎత్తుపల్లాలను సరిచేశారు. ట్రాక్టర్లతో దున్ని, సరుగుడు మొక్కలు వేయడానికి సిద్ధం చేశారు. ఈ విషయాన్ని ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఆక్రమణదారులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా.. త్వరలో సర్వే చేయించి సరిహద్దులు నిర్ధారించిన తరువాత ఆక్రమణలను తొలగిస్తామని చెబుతున్నారు.



పాపయ్యపాలెం రిజర్వాయర్

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో అనకాపల్లి కన్యకాపరమేశ్వరి అమ్మవారు

శ్రావణమాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని ఇంటింటా వరలక్ష్మీదేవి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. పూజకు అవసరమైన పూలు, పండ్లు, మిఠాయిలను ముందు రోజే సిద్ధం చేసుకున్నారు. శుక్రవారం పిండి వంటలు తయారు చేసుకుని వరలక్ష్మీదేవికి పూజలు చేశారు. కాగా శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా పలు ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. అనకాపల్లిలో నూకాంబిక అమ్మవారిని రూ.7 లక్షల విలువ చేసే వివిధ కరెన్సీ నోట్లతో అలంకరించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఏటికొప్పాక నుంచి పులపర్తికి అక్రమ రవాణా

- రెవెన్యూ అధికారులకు స్థానికుల సమాచారం
- రైల్వే గేటు వద్ద పట్టుకున్న హెచ్‌డీటీ
- 130 బస్తాల్లో వున్న ఆరున్నర టన్నుల బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యం రవాణా చేస్తున్న లారీని ఆపిన రెవెన్యూ శాఖ హెచ్‌డీటీ వినయ్‌కుమార్, సిబ్బంది

ఎలమంచిలి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): లారీలో అక్రమంగా తరలిస్తున్న సుమారు ఆరున్నర టన్నుల రేషన్ బియ్యాన్ని మండలంలోని ఏటికొప్పాక సమీపంలో రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.



లారీలో బియ్యం బస్తాలు

ఏటికొప్పాక, పరిసర గ్రామాల్లో రేషన్ కార్డుదారుల నుంచి కొంతమంది దళారులు బియ్యం కొనుగోలు చేసి, రైస్ మిల్లుకు తరలిస్తుంటారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి రేషన్ పంపిణీ ప్రారంభం కావడంతో ఆయా కార్డుదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని ఏటికొప్పాకలోని ఒక ఇంటిలో భద్రపరిచారు. శుక్రవారం రాత్రి లారీలోకి బియ్యం బస్తాలను ఎక్కిస్తుండగా చూసిన కొంతమంది స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫోన్ చేసి సమాచారం ... మిగతా 8వ పేజీలో

శారదానగర్ డ్రైనేజీ సమస్యకు మోక్షం

స్పీకర్ అయ్యన్న ఆదేశాలతో ఆర్‌అండ్‌బీ అధికారుల ప్రతిపాదనలు ఆమోదించిన ఉన్నతాధికారులు

- రూ.1.85 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ
- అసంపూర్తి డ్రైనేజీ కాలువ నిర్మాణం, బైపాస్ రోడ్డుపై బీటీ లేయర్
- స్థానికులకు తీరనున్న మురుగునీటి సమస్య

నర్సీపట్నం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం నియోజకవర్గం.. ప్రధానంగా నర్సీపట్నం మునిసిపాలిటీలో ప్రజలకు మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ అయిన చింతకాయల అయ్యన్నపాత్రుడు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు ఆయా పనులకు త్వరగా ఆమోదం తెలపడం, సత్వరమే నిధులు విడుదల చేసేలా తనవంతు కృషిచేస్తున్నారు. ఇందులో భాగంగా మునిసిపాలిటీ పరిధిలోని బలిఘట్టం శారదానగర్‌లో అసంపూర్తిగా వున్న డ్రైనేజీ కాలువ నిర్మాణానికి, బైపాస్ రోడ్డుపై బీటీ లేయర్ వేయడానికి నిధులు మంజూరు చేయించారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రహరీ గోడను ఆనుకొని డ్రైనేజీ కాలువ నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మునిసిపాలిటీ పరిధిలోని బలిఘట్టం ప్రాంతంలో వున్న శారదానగర్ ఒకింత లోతట్టుగా వుంటుంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఇళ్లల్లో వాడుక నీరుతోపాటు వర్షం నీరు బయటకు పోయే మార్గం సరిగా లేదు. దీంతో వర్షాకాలంలో ఎక్కువ రోజులు నీరు నిలిచిపోయి దోమల బెడద అధికంగా వుంటున్నది. ఈ సమస్య పరిష్కారానికి గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు 2018లో నాటి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు బలిఘట్టం బైపాస్ రోడ్డు (శారదాగనర్ రోడ్డు) అభివృద్ధి, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి రూ.4.5 కోట్లు మంజూరు చేయించారు. దుర్గామల్లీశ్వరస్వామి గుడి వద్ద నుంచి బైపాస్ రోడ్డు చివరి వరకు 1.84 కిలోమీటర్ల మేర రోడ్డు అభివృద్ధి, 800 మీటర్ల మేర భూగర్భ డ్రైనేజీ, ఒక కిలో మీటరు మేర ఓపెన్ డ్రైనేజీ పనులు ... మిగతా 8వ పేజీలో



బైపాస్ రోడ్డులో అర్ధాంతరంగా ఉన్న డ్రైనేజీ కాలువ

సంక్షేమ హాస్టళ్లకు ర్యాంకులు

మెరుగైన ఫలితాల సాధనకు ప్రభుత్వ యత్నం

- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు
- ఆరు అంశాల్లో పనితీరును పరిగణనలోకి తీసుకుని ర్యాంకులు కేటాయింపు
- సాంఘిక సంక్షేమ, బీసీ, గిరిజన సంక్షేమ వసతి గృహాలకు వర్తింపు
- పిల్లలకు రాయడం, చదవడం, లెక్కలు నేర్పించేందుకు వలంటీర్ల నియామకం



విశాఖపట్నం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వసతి గృహాల మధ్య పోటీతత్వాన్ని పెంచి మెరుగైన ఫలితాలను సాధించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే వసతి గృహాల పనితీరును బట్టి ర్యాంకులు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ విధానాన్ని అమలుచేసి, వచ్చే ఏడాది ర్యాంకులను ప్రకటించనున్నది. ఇందుకోసం ప్రత్యేకంగా ఆరు పారామీటర్స్‌ను విడుదల చేసింది. జిల్లాలోని సాంఘిక, బీసీ సంక్షేమ వసతి గృహాలకు చెందిన అధికారులకు ఈ సమాచారాన్ని అందించింది.

ప్రభుత్వం సూచించిన ఆరు అంశాలకు వంద మార్కులను కేటాయించింది. అకడమిక్ పెర్ఫార్మెన్స్‌కు 40 మార్కులు (ఇందులో హాస్టల్‌లో ఉన్న విద్యార్థులందరి ప్రగతికి 20 మార్కులు, అద్భుతమైన ఫలితాల సాధనకు మరో 20 మార్కులు) ఉంటాయి. అలాగే, విద్యార్థుల హాజరు, రిటెన్షన్‌కు ఐదు చొప్పున పది మార్కులను కేటాయించారు. అలాగే, మెనూ అమలుకు పది మార్కులను కేటాయించారు. ఇందులో మెనూ ప్రదర్శనకు రెండు, అమలుకు ఎనిమిది మార్కులు ఉంటాయి. హాస్టల్‌లో అనుకోని విధంగా ఏవైనా ఘటనలు జరిగి విద్యార్థులు ఇబ్బందిపడితే వాటికి స్పందించడం, ఉన్నతాధికారులకు ... మిగతా 8వ పేజీలో

దిబ్బపాలెం రోడ్లు ఛిద్రం

సెజ్ పునరావాస కాలనీ మీదుగా భారీ వాహనాల రాకపోకలు

అచ్యుతాపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): భారీ వాహనాల రాకపోకలతో ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పునరావాస కాలనీ (దిబ్బపాలెం)లో రోడ్లు ఛిద్రమవుతున్నాయి. కొన్నిచోట్ల తేలికపాటి వాహనాలు సైతం వెళ్లడానికి వీలుకాని విధంగా భారీ గోతులు ఏర్పడ్డాయి. అంతేకాక వాహనాల రాకపోకల సమయంలో పెద్దఎత్తున దుమ్ము, ధూళి ఎగిసిపడి స్థానికులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.



సెజ్ పునరావాస కాలనీ రోడ్డుపై వెళుతున్న భారీ వాహనాలు

- అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ వంతెన పనులతో ట్రాఫిక్ మళ్లింపు
- ఎక్కడికక్కడ ధ్వంసమైన రహదారులు
- ఎగిసిపడుతున్న దుమ్ము, ధూళి
- వర్షం కురిస్తే బురదమయంతో కాలనీవాసుల ఇక్కట్లు

అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో సుమారు 24 గ్రామాల భూములతోపాటు నివాసిత ప్రదేశాలను ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) కోసం సుమారు రెండు దశాబ్దాల క్రితం ఏపీఐఐసీ ద్వారా ప్రభుత్వం సేకరించిన విషయం తెలిసిందే. నిర్వాసితులకు పునరావాసం కోసం దిబ్బపాలెం వద్ద 458 ఎకరాలను కేటాయించారు. ప్రస్తుతం ... మిగతా 8వ పేజీలో



దిబ్బపాలెం పంచాయతీ కార్యాలయం ఎదుట గోతులమయమైన రహదారి

ఏపీఎల్ సందడి



ఏపీఎల్ కప్‌తో కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, సినీ నటుడు వెంకటేశ్



ప్రగ్యా జైస్వాల్ డ్యాన్స్

-వార్త మెయిన్ ఎడిషన్‌లో

- పీఎం పాలెం స్టేడియంలో సీజన్-4 టోర్నీ ఘనంగా ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని పీఎం పాలెంలోగల ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-4 టోర్నీ అట్టహాసంగా ప్రారంభమైంది. కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ప్రముఖ సినీ నటుడు విక్టరీ వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రారంభ కార్యక్రమంలో సినీ నటి ప్రగ్యా జైస్వాల్ డ్యాన్స్ ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది.

పాండురంగా.. నీ దర్శనానికి దారేదీ..?

- ఆక్రమణలతో ఇరుకుగా మారిన రోడ్డు
- రాకపోకలకు వాహనదారుల ఇక్కట్లు
- పట్టించుకోని ఆలయ అధికారులు
- నిలువు మెట్లతో భక్తులకు ఇబ్బందులు

పాయకరావుపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో పాండురంగస్వామి ఆలయానికి వెళ్లేందుకు సరైన మార్గం లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. మెయిన్‌రోడ్డులో ఉన్న ఈ ఆలయానికి వెళ్లేందుకు తాండవ వంతెనను ఆనుకుని సర్వీసు రోడ్డు ఉన్నా ఆక్రమణల కారణంగా భక్తుల వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అంతేకాకుండా వాహనాల పార్కింగ్‌కు స్థలం లేక అవస్థలు వాహనదారులు పడుతున్నారు. వంతెనపై నుంచి ఉన్న మెట్లు నిలువుగా ఉండడంతో భక్తులు మెట్లు దిగేందుకు, ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

పాయకరావుపేటలోని పాండురంగస్వామి భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. వందేళ్ల క్రితం చిన్న పంచాయతీగా ఉన్న పాయకరావుపేటలో తాండవ నది ఒడ్డున విశాలమైన స్థలంలో పాండురంగస్వామి ఆలయాన్ని నిర్మించారు. కాలక్రమంలో ఆలయం చుట్టూ ఖాళీ స్థలం ఆక్రమణలపాలవగా 1990లో వచ్చిన వరదలకు తాండవ నదిపై ఉన్న పురాతన వంతెన కొట్టుకుపోయింది. దాని స్థానంలో కొత్తగా వంతెన నిర్మించిన అధికారులు మెయిన్‌రోడ్డులో ఉన్న పాండురంగస్వామి ఆలయానికి వెళ్లేందుకు వంతెనను ఆనుకుని సర్వీసు రోడ్డును ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధిలో భాగంగా మెయిన్‌రోడ్డు వైపు


పాయకరావుపేటలో పాండురంగస్వామి ఆలయం

ఆలయ ప్రధాన ద్వారం వదిలిపెట్టి మిగిలిన స్థలంలో తాండవ వంతెనను ఆనుకుని దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. అదేవిధంగా షాపింగ్ కాంప్లెక్స్ కింద ఖాళీ స్థలంలో దాతల సాయంతో కల్యాణ మండపం కూడా ఏర్పాటుచేశారు.

వంతెన పైనుంచి ఆలయానికి, కల్యాణ మండపానికి వెళ్లేందుకు మెట్లు ఏర్పాటుచేశారు. ఈ తరువాత నుంచి ఆలయాన్ని పట్టించుకున్నవారు లేక సర్వీసు రోడ్డు ఇరువైపులా ఆక్రమణలపాలవగా.. సర్వీసురోడ్డుపై ఒకచోట షాపు నిర్మాణం చేపట్టారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలకు పార్కింగ్ స్థలం లేకపోగా రాకపోకలకు కూడా ఇబ్బందిగా మారింది. ఇదిచాలదన్నట్టు సర్వీసు రోడ్డు ప్రారంభంలో ఉన్న బడ్డీల్లో నాన్


సర్వీసురోడ్డుపై పక్కా నిర్మాణాలు చేపట్టిన దృశ్యం

విజిటేరియన్, ఫాస్ట్ ఫుడ్ ఐటమ్స్ విక్రయిస్తుండడంతో ఆలయానికి వచ్చే భక్తులు వీటి మధ్య నుంచే ఆలయానికి చేరుకోవాల్సి వస్తోంది. ఇక తాండవ వంతెన నుంచి ఆలయానికి ఏర్పాటుచేసిన మెట్లు పెద్దవి కావడంతోపాటు నిలువుగా ఉండడంతో ఆలయానికి వచ్చే మహిళలు, వృద్ధులు, పిల్లలు మెట్లు ఎక్కి దిగేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండుగలు, పర్వదినాలు, వివాహాలు జరిగే సమయాల్లో ఆలయానికి అధిక సంఖ్యలో వచ్చే భక్తులు పార్కింగ్ సమస్యతో అవస్థలు పడుతున్నారు. పాండురంగస్వామి ఆలయానికి వెళ్లే సర్వీసురోడ్డుపై ఉన్న ఆక్రమణలు తొలగించి భక్తుల రాకపోకలు, వాహనాల పార్కింగ్‌కి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ సబ్ జూనియర్ సెలెక్షన్లు రేపు

అచ్యుతాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల పదో తేదీన ఉమ్మడి విశాఖ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సబ్ జూనియర్ అండర్-16 బాలబాలికల టోర్నమెంట్ కమ్ సెలెక్షన్లు నిర్వహిస్తున్నామని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంప నరసింహ నాయుడు తెలిపారు. నునపర్తి శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ ప్రాంగణంలో ఎంపికలు జరుగుతాయన్నారు. ఈ సెలెక్షన్‌లో పాల్గొనే క్రీడాకారులు 2010 జనవరి రెండు తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు ప్రకాశం జిల్లా చేబ్రోలులో జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

నేడు పథకాలపై బ్రాండిక్స్‌లో వర్క్‌షాప్

అచ్యుతాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై అవగాహన వర్క్‌షాప్‌ని ఈనెల 9న తమ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నామని బ్రాండిక్స్ యాజమాన్యం తెలిపింది. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపింది. ఈ కార్యక్రమం ద్వారా యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ఉద్యోగావకాశాలు, విద్యా సహాయ కార్యక్రమాలు, అభివృద్ధి మార్గాల గురించి పూర్తి సమాచారం ఇవ్వనున్నట్టు పేర్కొంది. మా బ్రాండ్‌ని మా ఉద్యోగులే నిర్మించారు. ఇప్పుడు వారి పిల్లల కలలను నెరవేర్చడంలో భాగస్వాములవడం మా బాధ్యతగా భావిస్తున్నామని బ్రాండిక్స్ యాజమాన్యం తెలిపింది.

పూడిమడక మాజీ సర్పంచ్ వెంకటరమణ గుండెపోటుతో మృతి



అచ్యుతాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిమడక మాజీ సర్పంచ్ చేపల వెంకటరమణ (54) శుక్రవారం తెల్లవారు జామున గుండెపోటుతో మరణించారు. ఆయన గత కొంతకాలయంగా హృద్రోగంతో బాధపడుతున్నారు. గురువారం ఉదయం సాధారణ తనిఖీల నిమిత్తం విశాఖపట్నం వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేశారు. గురువారం రాత్రి మూడు గంటల ప్రాంతంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆసుపత్రికి తీసుకువెళ్లే ప్రయత్నం కుటుంబసభ్యులు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. వెంకట రమణ 1995, 2006ల్లో సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2021లో మహిళారిజర్వేషన్ కావడంతో ఆయన భార్య సుహాసిని సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు. వెంకటరమణ మరణ వార్త విని పూడిమడక శోకసంద్రంలో మునిగిపోయింది.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు 'పేట' విద్యార్థుల ఎంపిక


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో విద్యా సంస్థల అధినేతలు

పాయకరావుపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్-7 అథ్లెటిక్స్ పోటీల్లో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్. విజయ్‌ప్రకాష్ తెలిపారు. నెల్లూరులో ఇటీవల జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్-7 అథ్లెటిక్స్ పోటీలు అండర్-14, అండర్-19 విభాగాల్లో జరిగిన జావెలిన్ త్రో, 400 మీటర్ల పరుగు, 4 400 రిలే పరుగు పోటీల్లో తమ విద్యార్థులు ఆదిత్యకుమార్, జయసత్య, సునీల్ కుమార్, సత్యపవన్, దుర్గాప్రసాద్, ఎం.కేశవ్‌కుమార్ అద్భుత ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించారన్నారు. వీరంతా వచ్చే నెలలో వారణాసిలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. పలువురు విద్యార్థులు వివిధ పోటీల్లో కాంస్య పతకాలు గెలుచుకున్నారని ఆయన తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, కోచ్‌లు చిన్నా, శ్రీరామాంజనేయులు, తలిదండ్రులు అభినందనలు తెలిపారు.

శ్రీదేవితల్లి ఆలయానికి రూ.25 వేల విరాళం

మునగపాక, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉమ్మలాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీదేవితల్లి ఆలయానికి అదే గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు మొల్లేటి ఆనంద్ రూ.25వేలు విరాళంగా అందజేశారు. శుక్రవారం ఆలయం వద్ద కమిటీ పెద్దలకు తన సోదరుడు భాస్కర్‌తో కలిసి అందజేశారు.

దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక శిక్షణ


దివ్యాంగ పిల్లలకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు వైవీ రమణ

నక్కపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులైన పిల్లల్లో వున్న ఆసక్తిని తల్లిదండ్రులు గుర్తించి, వారిని ప్రోత్సహించాలని చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు వై వెంకట రమణ చెప్పారు. చినదొడ్డిగల్లు, పరిసర గ్రామాలకు చెందిన దివ్యాంగ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, ఖాళీ సమయాల్లో వారికి అక్షరాలు నేర్పిస్తున్నారు. దివ్యాంగ పిల్లల్లో వున్న సృజనాత్మకతను వెలికితీసి, వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వారి ఇళ్లకు వెళ్లి శిక్షణ ఇస్తున్నానని ఉపాధ్యాయుడు వెంకట రమణ చెప్పారు. ఆయన సేవలను పలువురు ప్రశంసించారు.

టీడీపీ హయాంలో మహిళలకు గౌరవం

- తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు

మునగపాక, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మహిళలకు అన్ని రంగాల్లో గౌరవం, సముచిత స్థానం కల్పిస్తోందని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు అన్నారు. మండలంలో చెర్లోపాలెం గ్రామంలో శుక్రవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి రానుందని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు కాండ్రేగుల శంకర్, నాగేష్ పాల్గొన్నారు.

తాండవ నీరు విడుదల రేపు

నాతవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల పదో తేదీన తాండవ రిజర్వాయర్ నుంచి నీటిని స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి వంగలపూడి అనిత విడుదల చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, ఎస్ఐ సీహెచ్ భీమరాజు, తదితరులు పరిశీలించారు. నాతవరం, నర్సీపట్నం, కోటురట్ల, తుని, రౌతులపూడి, కోటనందూరు మండలాల రైతులతో తాండవడామ్ వద్ద ఆదివారం సమావేశం జరగనుంది.

పసుపు కొమ్ముల అలంకరణలో వరమహాలక్ష్మి

- ఆలయానికి పోటెత్తిన భక్తులు


చిట్టూరి మెట్రోలో పసుపు కొమ్ముల అలంకరణలో సర్వ శుభంకరిలక్ష్మిగా దర్శనమిస్తున్న వరమహాలక్ష్మి

పాయకరావుపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం వరలక్ష్మి వ్రతాన్ని శుక్రవారం పట్టణ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలో చిట్టూరి మెట్రో ఆవరణలో వరమహాలక్ష్మి అమ్మవారు సర్వ శుభంకరిలక్ష్మిగా దర్శనమిచ్చారు. అమ్మ వారిని పసుపు కొమ్ములతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. స్థానిక పాండురంగస్వామి ఆలయం, దుర్గాలమ్మ చెట్టు ఆలయం, దుర్గాలయం, వేంకటేశ్వరాలయం, లక్ష్మీగణపతి ఆలయాల్లో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు.

మార్కెట్‌లో రాఖీ సందడి


ఎలమంచిలిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక దుకాణాల్లో విక్రయిస్తున్న రాఖీలు

ఎలమంచిలి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలో రాఖీ విక్రయ దుకాణాల వద్ద సందడి నెలకొంది. మార్కెట్‌లో వివిధ మోడళ్లలో రాఖీ బ్యాండ్‌లను వ్యాపారులు విక్రయిస్తున్నారు. యువత ఫొటోలు ఏర్పాటు చేసుకునేలా కొత్త తరం రాఖీలను వ్యాపారులు మార్కెట్లోకి తీసుకువచ్చారు. వీటి పట్ల యువకులు ఆకర్షితులవుతున్నారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో 8 వరకు పెద్ద రాఖీ విక్రయ దుకాణాలను వ్యాపారులు ఏర్పాటు చేశారు. వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేశారు. యువతను ఆకట్టుకునేలా వివిధ మోడళ్లలోని రాఖీలను అందుబాటులో విక్రయానికి ఉంచారు. శుక్రవారం రాఖీ విక్రయాలు మరింత జోరందుకున్నాయని వ్యాపారులు తెలిపారు.

విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ


రూ. 5.2లక్షల సొంత నిధులను సమకూర్చిన హోం మంత్రి అనిత


బాలికలకు నాప్‌కిన్స్ పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు కొప్పిశెట్టి వెంకటేశ్, తదితరులు

నక్కపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లిలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల, కేజీబీవీ, పెదగుమ్ములూరు కేజీబీవీల్లో చదువుకుంటున్న వందలాది మంది బాలికలకు శుక్రవారం హోం మంత్రి అనిత సమకూర్చిన రూ.5.2 లక్షలతో శానిటరీ ప్యాడ్స్‌ను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. హోం మంత్రి అనిత కుమార్తె రేష్మిత జన్మదిన వేడుకల్లో భాగంగా టీడీపీ నాయకులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయా విద్యా సంస్థల విద్యార్థినులకు టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ, నక్కపల్లి సొసైటీ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి శానిటరీ ప్యాడ్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గింజాల లక్ష్మణరావు, దార్ల కృష్ణ, రెడ్డి వరహాలు, పెదపూడి శంకరరావు పాల్గొన్నారు.

నీటి వృథాకు అన్నదాతల అడ్డుకట్ట

- దెబ్బతిన్న నరసాపురం ఆనకట్ట గేట్లు అడుగు భాగం..
- 900 ఇసుక బస్తాలతో లీకుల కట్టడి


ఆనకట్ట గేట్లు కింద ఇసుక బస్తాలను ఏర్పాటు చేస్తున్న రైతులు, కూలీలు

ఎలమంచిలి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నరసాపురం ఆనకట్ట నుంచి సాగునీరు వృథా కాకుండా రైతులు అడ్డుకట్ట వేశారు. ఆనకట్ట గేట్లు కింద ఉన్న బుష్‌లు దెబ్బతినడంతో సాగు నీరు వృథాగా పోతున్నది. దీంతో శుక్రవారం నరసాపురం ఆనకట్ట చైర్మన్ ఉప్పులూరి అప్పలనాయుడు, జంపపాలెం సాగునీటి సంఘం అధ్యక్షుడు దాడి చంద్రశేఖర్, రామారాయుడుపాలెం రైతు ప్రతినిధి గొర్లె బాబూరావు ఆయకట్టు రైతులతో కలిసి 900 ఇసుక బస్తాలతో నీటి వృథాను అరికట్టారు. అసలే వరి నారు మడులకు వర్షం కోసం రైతులు అంతా ఎదురుచూస్తున్నారు. వరుణుడి జాడ లేకపోవడంతో ఆకులు ఎండిపోతున్నాయని బాబూరావు తెలిపారు. దీంతో ఆనకట్ట నుంచి నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని ఆయకట్టు రైతులంతా భావించామని రైతు ప్రతినిధి గొర్లె బాబూరావు తెలిపారు. ఇదే కనుక ఫలితాన్ని ఇస్తే జంపపాలెం ఆయకట్టు భూములకు నరసాపురం ఆనకట్ట నుంచి సాగునీరు ప్రవహించి ఎండిపోతున్న ఆకుమడులు జీవం పోసుకుంటాయని ఆయన చెప్పారు.


ఆనకట్ట వద్ద పనులు చేసిన రైతులు, కూలీలతో ఆనకట్ట చైర్మన్ అప్పలనాయుడు, నీటి సంఘం ప్రతినిధులు, రైతు గొర్లె బాబూరావు

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు

ప్రతి ఇంట పువ్వులు, పండ్లు, పిండి వంటలు, బంగారం, వెండి కాసులతో పూజలు

మునగపాక/ఎస్.రాయవరం/నక్కపల్లి/ఎలమంచిలి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో శుక్రవారం జరుపుకున్నారు. లక్ష్మీదేవి చిత్రపటాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. వెండి, బంగారం కాసులు, ఆభరణాలతో పాటు పలు రకాలు మిఠాయిలు, పండ్లు, పుష్పాలతో పూజలు చేశారు.

అష్టఐశ్వర్యాలతో పాటు సుఖ, సంతోషాలు కల్పించాలని లక్ష్మీదేవిని ప్రార్థించారు. వరలక్ష్మి వ్రతకథను చదివి భక్తి గీతాలను ఆలపించి మొక్కులు చెల్లించారు. ప్రతి ఇళ్ల పచ్చని తోరణాలు, పసుపు, కుంకుమ అలంకరణలుతో శోభాయమానంగా మారాయి. అనంతరం ముత్తయిదువలకు తాంబూలములు పరస్పరం ఇచ్చుపుకున్నారు. ఎస్.రాయవరం మండలంలోని అడ్డరోడ్డులో


వరలక్ష్మిదేవికి పూజ చేస్తున్న దంపతులు

గల దుర్గాదేవి అమ్మవారు శుక్రవారం రజిత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నక్కపల్లి మండలంలోని ఉపమాక, బంగారమ్మపేట, నక్కపల్లి, రేబాక, చినదొడ్డిగల్లు గ్రామాల్లో వున్న అమ్మవారి ఆలయాలను మహిళా భక్తులు దర్శించుకున్నారు.

16వేల గాజులతో దుర్గాదేవికి అలంకరణ



మునగపాక, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):శ్రావణ మాసం ప్రత్యేక పూజల్లో భాగంగా తిమ్మరాజుపేటలో దుర్గాదేవిని 16వేల గాజులతో అలంకరించారు. మండలంలో తిమ్మరాజుపేట అయ్యప్పస్వామి ఆలయ సముదాయంలో ఉన్న దుర్గాదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం కావడంతో గాజులతో అలంకరణ చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా తోట నగేశ్ జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు చెప్పేందుకు పోటెత్తిన నేతలు, అభిమానులు
- పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

పాయకరావుపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, జనసేన పార్టీ నాయకులు తోట నగేశ్ జన్మదిన వేడుకలు శుక్రవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఆయన స్వగృహం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమానికి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ముర్రు ముత్యాల నాయుడు, టీడీపీ నాయకుడు కొయ్యా ప్రసాదరెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, నాలుగు మండలాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు తోట నగేశ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు అభిమానులు తోట నగేశ్, ముర్రు ముత్యాలనాయుడులను గజమాలతో సత్కరించారు. అనంతరం అభిమానుల సమక్షంలో తోట నగేశ్ పుట్టిన రోజు కేక్‌ను కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులు వంద మందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీవీవీ.సత్యనారాయణ, అక్కిరెడ్డి వరహాలు, ఇంజరపు సూరిబాబు, దేవాది మంగాదేవి, పెంకే శ్రీను, ఐఎస్.మూర్తి, ముక్కుడుపల్లి నాగరాజు తదితరులు సేవలు అందజేశారు.


తోట నగేశ్, మాజీ వైస్ ఛాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడులను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, అభిమానులు

లోవపాలెం కాలనీలో తాగునీటి సమస్య

- ఏడాదిగా నీటి కోసం ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు
- గ్రామంలో ఉప్పు నీరు పడడంతో తిప్పలు
- పట్టించుకోని పాలకులు, అధికార్లు


లోవపాలెం ఎన్‌టీఆర్ కాలనీలో నిరుపయోగంగా ఉన్న మినీ రక్షిత నీటి పథకం

రాంబిల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్. చింతువా పంచాయతీలో లోవపాలెం ఎన్‌టీఆర్ కాలనీ వాసులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో 100 కుటుంబాలు నివసిస్తున్నాయి. గతంలో గజిరెడ్డిపాలెం రక్షిత నీటి పథకం నుంచి ఎన్‌టీఆర్ కాలనీకి తాగునీరు వచ్చేదని, ఏడాది నుంచి తాగునీరు రావడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు. కాలనీలో బోర్లు తీయించినా ఉప్పునీరు వస్తున్నదని, వాడుకకు కూడా ఉపయోగపడడం లేదని వారు వాపోతున్నారు. సమీప లోవపాలెం గ్రామంలోకి వెళ్లి తాగడానికి, వాడుకకు నీటిని తెచ్చుకుంటున్నామన్నారు. కాలనీలో పండుగలు, శుభకార్యాలు సమయాల్లో నీటి కోసం నానా ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. కాలనీలో తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన రక్షిత మినీ నీటి పథకం కూడా పనిచేయడం లేదన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు మండల అధికారులకు విన్నవించుకున్నప్పటికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, సంబంధిత శాఖ అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని లోవపాలెం ఎన్‌టీఆర్ కాలనీ ప్రజలు కోరుతున్నారు.

ఇంటింటా వరలక్ష్మీదేవి వ్రతాలు

▸ అమ్మవార్లకు విశేష అలంకరణలు..

▸ ఆలయాలకు పోటెత్తిన భక్తులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం అనకాపల్లిలో శుక్రవారం ఇంటింటా వరలక్ష్మీదేవి వ్రతాలను ఘనంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజామునే కుటుంబ సభ్యులంతా పరిశుభ్రంగా తయారై పూజకు అవసరమయ్యే పిండి వంటలు, పులిహోర వంటి సామగ్రిని సిద్ధం చేసుకొని పూజా మందిరంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముత్తాయిదువులకు వాయినాలు అందించారు. ఇదిలా ఉండగా శ్రావణ మాసం వరలక్ష్మి వ్రతం సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక అలంకరణ చేశారు. ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన స్థానిక నూకాంబిక అమ్మవారిని రూ.7 లక్షల కరెన్సీ నోట్లతో అందంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు భారీ ఎత్తున కుంకుమ పూజలు నిర్వహించారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ఆలయ ఈవో కేఎల్ సుధారాణి, మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే కన్యకాపరమేశ్వరి ఆలయంలో వరలక్ష్మీదేవి వ్రతం సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే గవరపాలెం సతకంపట్టులోని కనకదుర్గమ్మ అమ్మవారిని వరలక్ష్మీదేవి అలంకరణలో తీర్చిదిద్దారు. ఆలయ అర్చకులు భోగాపురపు వెంకటరమణ ఆధ్వర్యంలో విశేష అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, ఆలయ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, పెద్దలు పాల్గొన్నారు. అలాగే సంతోషి మాత, సర్వకామదాంబ అమ్మవార్లను కూడా ఆలయ నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.





అనకాపల్లి నూకాంబిక ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళా భక్తులు... సబ్బవరం: దేవీపురంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

అనకాపల్లి మండలంలో...

అనకాపల్లి రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరలక్ష్మీ వ్రతాన్ని ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వేకువ జాము నుంచి కుటుంబీకులంతా లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ముత్తాయిదువులకు వాయినాలు అందించారు. అనంతరం సమీపంలోని ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

సబ్బవరంలో...

సబ్బవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ఆలయాల్లో శుక్రవారం శ్రావణమాసం పూజలు ఘనంగా జరిగాయి. దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీ అమ్మవారి పీఠంతో పాటు శివాలయాలు, విష్ణు ఆలయాలు, పలు దేవాలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు, పుష్పార్చనలతో పూజలు చేశారు. సబ్బవరం దుర్గమాంబ ఆలయంలో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో తీర్చిదిద్దిన నూకాంబిక.. కన్యకాపరమేశ్వరి... కనకదుర్గమ్మ అమ్మవార్లు

టీడీపీ బలోపేతానికి కృషిచేయండి

▸ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



కర్రి బాబిని సత్కరిస్తున్న పల్లా శ్రీనివాసరావు

తుమ్మపాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి పార్టీ నేతలతో కలిసి పల్లా శ్రీనివాసరావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో పరిస్థితులను, పార్టీ కార్యక్రమాలను పల్లాకు వివరించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని 32 పంచాయతీలలో 98 శాతం పూర్తిచేసినట్టు వివరించారు. దీంతో కర్రి బాబిని పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు శాలువా కప్పి సత్కరించారు. భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు పార్టీ బలోపేతానికి మరింత శ్రమించాలని ఆయన సూచించారు.

జిల్లా స్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన బాలురు జట్టు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నేతృత్వంలో ఈ నెల 29న క్రీడా పోటీలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా శుక్రవారం గవరపాలెం దిబ్బవీధి కొబ్బరి తోటలో వాలీబాల్ బాల, బాలికల జట్ల ఎంపికను శాప్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 50 మంది బాలురు, 16 మంది బాలికలు హాజరయ్యారు. వీరిలో బాలురు విభాగంలో 25 మంది బాలురును ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 13 వరకు శిక్షణ ఇస్తారు. వీరిలో ఎంపిక చేసిన 12 మంది క్రీడాకారులు విశాఖపట్నంలో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న జోనల్ పోటీల్లో పాల్గొంటారు. అక్కడ గెలుపొందిన జట్టు ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని డీఎస్‌డీవో ఎల్‌వీ.రమణ తెలిపారు. ఈ జట్లకు కోచ్ కమ్ మేనేజర్లుగా బీశెట్టి శ్రీనివాసరావు, విల్లూరి ప్రసాద్ వ్యవహరిస్తారు. ఈ జట్ల ఎంపిక కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు కేఎస్‌వీ.సత్యనారాయణ, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు యల్లపు గోవింద, రాపేటి సీతారాం, ఆడారి హరి ప్రభాకర్, పీలా రమణారావు, బుద్ద శివ, యల్లపు సత్యనారాయణ, శిలపరశెట్టి భాస్కరరావు, మోటూరి నాగేశ్వరరావు, పీఈటీలు ఎస్‌వీ నరసింహం, కేఎం.నాయుడు పాల్గొన్నారు. శనివారం బాలికల జట్టు ఎంపిక నిర్వహించనున్నట్టు ఎల్‌వీ.రమణ తెలిపారు.

అనకాపల్లిలో రాఖీల కొనుగోళ్ల సందడి



నెహ్రూచౌక్‌లో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం రాఖీల కొనుగోళ్ల సందడి నెలకొంది. అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకైన రాఖీ పండుగను శనివారం ఘనంగా జరుపుకునేందుకు మహిళలు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా అన్నదమ్ములకు కట్టే రాఖీల కొనుగోళ్లతో నెహ్రూచౌక్, చిననాలుగురోడ్ల జంక్షన్ తదితర ప్రాంతాలు సందడిగా మారాయి. అలాగే మిఠాయి దుకాణాలు కూడా కొనుగోలుదారులతో సందడిగా కనిపించాయి.

నాడు మురికి కూపం.. నేడు బహు సుందరం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 83వ వార్డు పరిధిలో ఏఎంసీ కాలనీ చేపల మార్కెట్ వద్ద గత కొన్నేళ్లుగా పారిశుధ్యం లోపించింది. పరిసర ప్రాంతం మురికి కూపంలా తయారైంది. చేపల అమ్మకాలు చేసేవారు ఎప్పటికప్పుడు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో ఆ ప్రాంతమంతా దరిద్రంగా మారింది. ఈ విషయమై కూటమి నాయకులు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. వారి ఆదేశాల మేరకు 83వ వార్డు కూటమి నాయకులు బొద్దపు ప్రసాద్, మంగ ఈశ్వర్, ఎస్.భానుచందర్ ఆధ్వర్యంలో జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది ఆప్రాంతాన్ని శుక్రవారం పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. అక్కడ ఎవరూ వ్యర్థాలు, చెత్తా చెదారం వేయకుండా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. దీంతో మురికికూపంగా మారిన ఆ ప్రదేశం పరిశుభ్రత, పచ్చదనంతో నిండిపోయి బహు సుందరంగా దర్శనమిస్తున్నది.





చేపల మార్కెట్ వద్ద పేరుకుపోయిన మురుగు... మురుగును తొలగించి మొక్కలు నాటుతున్న కూటమి నాయకులు

రహదారిపై మురుగుతో ఇక్కట్లు

పరవాడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సోమునాయుడుపాలెం నుంచి మూలస్వయంభూవరం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మురుగునీటి ప్రవాహంతో అధ్వానంగా ఉంది. మూలస్వయంభూవరం పూర్తిస్థాయిలో డ్రైనేజీలు నిర్మించకపోవడంతో వాడుక నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీనివల్ల పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు వల్ల ఈగలు, దోమలు వృద్ధి చెంది కంటిపై కునుకు లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై మురుగునీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను కోరినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి డ్రైనేజీల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



రహదారిపై ప్రవహిస్తున్న మురికి నీరు

ఓటు హక్కు హరించే ఎస్‌ఐఆర్‌ను వ్యతిరేకించాలి



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం బీహార్ తరహాలో చేపట్టాలని చూస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)ను అందరూ వ్యతిరేకించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ పౌరుల ఓటు హక్కును హరించే ఎస్‌ఐఆర్‌ను ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. బీహార్‌లో ఓటర్ల జాబితాను ప్రత్యేకంగా సమగ్రంగా సవరించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇప్పుడు ఈ ప్రక్రియను దేశవ్యాప్తంగా విస్తరింపజేయాలని ఎన్నికల కమిషన్ భావిస్తుందన్నారు. ఓటర్ల జాబితాలను సవరించే పేరుతో ఈసీ ఓటర్ల పౌరసత్వాన్ని నిర్ధారించే అధికారాన్ని స్వాధీనం చేసుకుంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

సూర్యనారాయణకు నివాళులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం సీపీఎం జిల్లా నేత ఎం.సూర్యనారాయణకు ఘనంగా నివాళులు అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ సూర్యనారాయణ లేని లోటు తీర్చలేనిదన్నారు. విద్యార్థి దశ నుంచే ఎస్ఎఫ్ఐ నేతగా ఎదిగి విద్యార్థుల పక్షాన నిలిచారన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారన్నారు. లోకనాథం మాట్లాడుతూ భౌతికంగా సూర్యనారాయణ మరణించినా ఆయనలోని ఉన్న అనేక అంశాలను మనం పాటించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు గంటా శ్రీరామ్, ఆర్.శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తి అవసరం

తుమ్మపాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామ స్వరాజ్య వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేశ్‌బాబు పేర్కొన్నారు. క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జీవీఎంసీలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ వారి కోరల్లో చిక్కుకున్న భారత దేశానికి స్వాతంత్ర్యం తెచ్చే క్రమంలో అనేక మంది పోరాటాలు చేసి ప్రాణ త్యాగాలను చేశారన్నారు. నేటి భారతీయులు అలనాటి క్విట్ ఇండియా స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ కలాం సేవ సంస్థ కన్వీనర్ ఆళ్ల ప్రవీణ్, ప్రజా రాజకీయ వేదిక ప్రతినిధులు మళ్ల చక్రవర్తి, కె.వాసు, అడపా సుధాకర్ పాల్గొన్నారు.



జీవీఎంసీ కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులు చేస్తున్న నాయకులు

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

కొత్తూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం వేటజంగాలపాలెం గ్రామంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ నెల 27న వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్ జన్మదినోత్సవం సందర్భంగా మండల పార్టీ నాయకుడు బొడ్డు యాకోబు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 60 టీములు పాల్గొన్నాయని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.20వేలు, రెండవ బహుమతి రూ.10వేలు నగదు బహుమతులు అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు జాజుల రమేష్, జీవీఎంసీ 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, నిర్వాహకులు డి.మోహన్, నాగు, శంకర్, శ్రీను, సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలిరెడ్డిపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణం

పరవాడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వాడచీపురుపల్లి పంచాయతీ పరిధిలోని పోలిరెడ్డిపాలెంలో సర్పంచ్ శివలంక లక్ష్మి శుక్రవారం సీసీ రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు రూ.5 లక్షలతో ఈ పనులు చేయనున్నట్టు సర్పంచ్ తెలిపారు. నాణ్యతాప్రమాణాలతో రోడ్డు నిర్మించాలని ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కూండ్రపు శ్రీనివాసరావు, స్థానిక నాయకులు వెలుగుల అనిల్‌కుమార్, నాయుడు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి మజిలీకి అవస్థలే..!

అంతిమ సంస్కారంలోనూ ప్రశాంతత కొరవడుతోంది. ముళ్ల పొదలు.. పిచ్చి మొక్కలు.. దారి కూడా లేని ప్రదేశాలు.. వెరసి దేశపాత్రునిపాలెం శ్మశానవాటిక దారుణంగా తయారైంది. అంత్యక్రియలు చేసేందుకు అక్కడ అడుగు పెట్టాలంటేనే గుబులు రేగుతోంది. వర్షాకాలంలో ప్రత్యక్ష నరకాన్ని తలపిస్తోంది. అయినప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం జనాలకు రోత పుట్టిస్తోంది.

ముళ్ల పొదలతో నిండిపోయిన దేశపాత్రునిపాలెం శ్మశానవాటిక

అడుగు పెట్టాలంటేనే భయానక వాతావరణం

అంత్యక్రియలకు వర్షాకాలంలో ప్రత్యక్ష నరకం

పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు



శ్మశానవాటిక ప్రాంగణంలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

పరవాడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం శ్మశానవాటికలో పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ఇక్కడ విష పురుగులు సంచారం అధికంగా ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు శ్మశానవాటికకు చెందిన షెడ్ శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు చుట్టూ పెద్ద ఎత్తున ముళ్ల తుప్పలు పెరిగిపోవడంతో అధ్వానంగా దర్శనమిస్తోంది. షెడ్ పై ఏర్పాటు చేసిన ఇనుప రేకులు పూర్తిగా తుప్పు పట్టి రంధ్రాలు ఏర్పడటంతో వర్షాల సమయంలోదహన సంస్కారాలు చేయడానికి ఇబ్బందులు తప్పలేదు. స్నానాలు చేసేందుకు ఏర్పాటు చేసిన బోరు చుట్టూ కూడా పిచ్చి మొక్కలు చుట్టిముట్టాయి. దీని కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వర్షాకాలంలో అంత్యక్రియలు చేయాలంటే నరకాన్ని చవి చూడాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. కనీసం కూర్చొనేందుకు అవకాశం లేకుండా పోయింది. శ్మశానవాటిక వద్ద విద్యుత్ సౌకర్యం కూడా లేదు. ఒక్కొక్కసారి చీకట్లోనే అంత్యక్రియలు చేపట్టాల్సిన దుస్థితి దాపురిస్తోంది. ఏళ్ల తరబడి శ్మశానవాటిక అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నా ఇటు అధికారులు కాని అటు పాలకులు గాని పట్టించుకోలేదని స్థానికులు మండి పడుతున్నారు. దహన సంస్కారానికి కూడా ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి శ్మశానవాటిక అభివృద్ధికి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న దహన సంస్కారాల షెడ్డు



తాగునీటి బోరు చుట్టూ పేరుకుపోయిన ముళ్ల పొదలు

శ్మశానవాటికలో అడుగు పెట్టాలంటేనే భయమేస్తుంది

-శనివాడ యశోధ, దేశపాత్రునిపాలెం



అంత్యక్రియలకు అవస్థలు తప్పడం లేదు. ఏళ్ల తరబడి శ్మశానవాటిక చుట్టూ పెద్ద ఎత్తున ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయి అధ్వానంగా తయారైంది. అడుగు పెట్టాలంటేనే భయమేస్తోంది. విష పురుగుల సంచారం అధికంగా ఉంది. విద్యుత్ సౌకర్యం కూడా లేదు. అంత్యక్రియలు చేయాలంటే నరకం చూస్తున్నాం.

అధికారులు పట్టించుకోవడం లేదు..

-బొండా లీలాకృష్ణ, దేశపాత్రునిపాలెం



శ్మశానవాటిక అభివృద్ధి గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. మాకెందుకులే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. శ్మశానవాటిక చుట్టూ ఉన్న ముళ్ల పొదలు తొలగించడానికి కూడా అధికారులకు ఖాళీ లేకుండా పోయింది. అంత్యక్రియలకు అవస్థలు తప్పడం లేదు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని దేశపాత్రునిపాలెం శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించాలి.

'ఆర్వీనగర్-పాలగెడ్డ రోడ్డు నిర్మాణానికి చొరవ తీసుకోవాలి'



మాట్లాడుతున్న సీలేరు, ధారకొండ ప్రాంత కాంగ్రెస్ నాయకులు

సీలేరు, ఆగస్టు 8 , (ఆంధ్రజ్యోతి):జీకేవీధి మండలంలోని ఆర్వీనగర్ నుంచి పాలగెడ్డ వరకు ఉన్న అంతర్రాష్ట్ర రహదారి పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని సీలేరు, ధారకొండ, గుమ్మిరేవుల, దుప్పులవాడ పంచాయతీలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కోరారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. శనివారం ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పాడేరు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ రహదారి పరిస్థితిని గుర్తించి అభివృద్ధికి ఆదేశాలివ్వాలన్నారు. చాలా ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోక పూర్తిగా పాడైపోయిందన్నారు. ఆర్వీనగర్ నుంచి పాలగెడ్డ వరకు ఉన్న రహదారి నిర్మాణం పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గత ఏడాది సంభవించిన తుఫాన్‌కు కొట్టుకుపోయిన గంగవరం, అగ్రహారం, చోడిరాయి, వంతెనలను నిర్మించాలనికోరారు. తుఫాన్‌కు నష్టపోయిన గిరిజన రైతులను ఆదుకోవాలని ఈ సందర్భంగా ముఖ్య మంత్రిని కోరారు. అలాగే, ఈ ప్రాంత కూటమి నాయకులు ఈ దిశగా కృషి చేయాలని విజ్ఞప్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుప్పులవాడ, గుమ్మిరేవుల మాజీ సర్పంచులు అల్లంకి రాజు, పూజారి బాబూరావు, డీసీ సీ కార్యదర్శి కారే శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు మల్లు దొర, సొన్ను, వానపల్లి అప్పారావు, షైలపల్లి సత్తిబాబు, సీహెచ్ శ్యామ్‌సన్ పాల్గొన్నారు.

పక్కా గృహాలకు అదనపు నిధులు ఏవీ?



గిరిజనులతో కలసి మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మన్, గ్రామీణ పక్కా గృహాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అదనపు నిధులను వెంటనే విడుదల చేయాలని గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన పీవీటీజీలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పీఎం జన్‌మన్‌కి రూ.లక్ష, గ్రామీణకు రూ.70వేలు అదనంగా చెల్లించనున్నట్టు ప్రకటించినా, నేటి వరకు నిధులు అందలేదన్నారు. గిరిజన ప్రాంతానికి వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే ఈ అదనపు నిధులు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థులు కృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.

లక్ష్మీదేవికి మకరతోరణం బహూకరణ



లక్ష్మీదేవి అమ్మవారికి అలంకరించిన మకరతోరణంతో దాత రాము, ఆలయ ప్రతినిధులు

పాడేరురూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పాడేరు పూర్ణపుష్కల అయ్యప్పస్వామి ఆలయ సముదాయంలోని మహాలక్ష్మి దేవి విగ్రహానికి స్థానిక హార్డ్‌వేర్ షాపు యజమాని వాసవి రాము మకరతోరణాన్ని బహూకరించారు.శ్రావణమాసం వరలక్ష్మి వ్రతం సందర్భంగా దీనిని రాము దంపతులు శుక్రవారం ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావు అందించి అమ్మవారికి అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బూరెడ్డి రామునాయుడు, వర్మ సత్యనారాయణరాజు, ఆదిత్య, సత్తిబాబు, రొబ్బి రాము, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

స్కూటీ చోరీ

అరకులోయ,ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): యండపల్లివలస గంగమ్మతల్లి గుడి ఎదుట ఉన్న పాణిగ్రహి ప్రణీత్‌కుమార్‌అనే వ్యక్తికి చెందిన రూ.1. 90 లక్షల విలువైన ఎలక్ట్రికల్ స్కూటీ చోరీ గురైంది. గురువారం రాత్రి 10.45 గంటల సమయంలో ఇంటి ఎదుట పార్కింగ్ చేసి స్కూటీని ఆగంతకులు ఎత్తుకుపోయినట్టు బాధితుడు తెలిపారు. సీసీ కెమెరాలో విజువల్స్ నమోదయ్యాయన్నారు. దీంతో శుక్రవారం అతను పోలీసులకు ఫిర్యాదు చేశారు.. పట్టణంలో పలు బైక్‌లు ఇటీవల కాలంలో చోరీకి గురవుతున్నాయి. పోలీసులు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి చోరీలను నిరోధించాలని స్థానికులు కోరుతున్నారు.



పాడేరు మహాలక్ష్మి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో వ్రతాల్లో మహిళలు

ఘనంగా వరలక్ష్మీ పూజలు

పాడేరురూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పాడేరు ఉమానీలకంఠేశ్వర స్వామి వారి రాజరాజేశ్వరి అమ్మవారి, పూర్ణపుష్కల అయ్యప్పస్వామి ఆలయాల్లోని మహాలక్ష్మీదేవి, మోదకొండమ్మ ఆలయాల్లో శ్రావణ మాసం మూడో శుక్రవారం పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు రమాదేవి దంపతులు, కొట్టగుళ్లి సుబ్బారావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లుకోటి బాబుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహాలక్ష్మీ దేవి అమ్మవారు భక్తులకు అష్టలక్ష్మీ దేవి రూపంలో దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి యూవీ రత్నం, ఉపాధ్యక్షులు కొట్టగుళ్లి రామారావు, కొమ్మోజి వెంకటరమణ, అధ్యాత్మిక సేవా బృంద ప్రతినిధులు శివ, నాగు, మూర్తి, గౌరీ, సంతోష్, భాగ్యలక్ష్మి, కాత్యాయని, తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం ఆలయాల్లో కుంకుమార్చనలు నిర్వహించారు.



పాడేరులో అమ్మవారికి సారె సమర్పిస్తున్న వాసవీ క్లబ్ మహిళలు

వాసవీ మాతకు సారె సమర్పణ

పాడేరురూరల్: పూర్ణపుష్కల అయ్యప్ప స్వామి ఆలయంలోని వాసవీ మాతకు వాసవీ క్లబ్ పాడేరు హిల్స్, వనితశ్రీ మోదమాంబ, వాసవీ క్లబ్ పాడేరు, వనిత పాడేరు క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో శ్రావణ మాసం పురస్కరించుకుని శుక్రవారం వాసవీ, అమ్మవారికి, మహాలక్ష్మి దేవికి సారె సమర్పించి ప్రత్యేక పూజలను చేపట్టారు. వాసవీ క్లబ్ ప్రతిధి శ్రీనాదు శ్రీను ఆధ్వర్యంలో నాలుగు క్లబ్‌లకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో మెయిన్ బజారు నుంచి అయ్యప్పస్వామి ఆలయం వరకు సారెను ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావుఅర్చకునికిఅందించారు. అనంతరం మహాలక్ష్మి ఆలయం లో కుంకుమ పూజలు చేపట్టారు.

సీలేరులో..

సీలేరు: జీకేవీధి మండలం సీలేరులో మారెమ్మ అమ్మవారి ఆలయం, ధారకొండ ధారాలమ్మ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలను , కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మారెమ్మ ధారాలమ్మగా భక్తుల దర్శనమిచ్చారు.



ప్రత్యేక అలంకరణలో సీలేరులో మారెమ్మ

రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలి: డీఎంహెచ్‌వో

అరకులోయ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో టి.విశ్వేశ్వరనాయుడు సూచించారు. మండలంలోని మాడగడ పీహెచ్‌సీని శుక్రవారం డీఎంహెచ్‌వో టి.విశ్వేశ్వరనాయుడు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కమల సందర్శించారు. ఆస్పత్రిలో రోగులతో మాట్లాడారు. పరిసరాలు, మందులు గదిని, రక్తపరీక్షలు, వార్డులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చిన వారికి మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు. అత్యవసరమైతే అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించాలన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు,సిబ్బందితో సమావేశమయ్యారు. డీఎంహెచ్‌వో ఆఫీస్ హెచ్‌ఈవో లక్ష్మణ్ పాల్గొన్నారు.

లుంగపర్తి పీహెచ్‌సీ పరిశీలన

అనంతగిరి: మండలంలోని లుంగపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డీఎంహెచ్‌వో డాక్టర్ టి.విశ్వేశ్వరరావునాయుడు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, మందుల నిల్వలను తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వార్డులో వున్న బాలింతలతో మాట్లాడి, భోజన సదుపాయం ఎలా ఉంది అని అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం వుందని, ముఖ్యంగా దోమల కారణంగా ప్రజలు మలేరియా, ఇతర జ్వరాలబారిన పడే అవకాశం వుందన్నారు. గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితి, జ్వరాల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుని, సత్వరమే వైద్యసేవలు అందించాలని డాక్టర్‌ను, సిబ్బందిని ఆదేశించారు. ఆయన వైద్యాధికారిణి మంజుభార్గవి, సిబ్బంది వున్నారు.



లుంగపర్తిలో రోగితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో విశ్వేశ్వరనాయుడు

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

» గిరిజన ఉద్యోగుల సంఘం నేత గంగరాజు

చింతపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్అండ్‌బీ మైదానంలో శనివారం నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గిరిజనులు విజయవంతం చేయాలని స్థానిక గిరిజన ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు బొడు గంగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మా ట్లాడుతూ సబ్ డివిజన్ కేంద్రంలో ఏటా తమ సంఘం ఘనంగా ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గిరిజన హక్కులు, చట్టాలు, ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలపై ప్రజలను చైతన్యం కల్పిస్తున్నామన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధనకు భవిష్యత్తు ప్రణాళిక రూ పొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీలకు శతశాతం ఉద్యోగ అవకాశాల కల్పించే జీవో 3కి ప్రత్యామ్నాయం తీసుకువస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, దీనిని సాధించేందుకు ఆదివాసీలు ఏవిధంగా ముందుకు వెళ్లాలనే అంశాలను చర్చిస్తామన్నారు. ఆదివాసీ దినోత్సవానికి అన్నివర్గాల ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, వివిధ సంఘాల నాయకులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఉప తహసీల్దార్ దుమంతి సత్యనారాయణ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ చైర్మన్ రీమల నవభారత్, గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు యూవీగిరి, గెమ్మెలి మోహన్‌రావు, దేపూరి శశి కుమార్, గెమ్మెలి కామేశ్వరరావు, ముర్ల వెంకట రమణ, బిలాస్కార్, హెచ్‌డబ్ల్యూవో శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లి ఆర్‌అండ్‌బీ మైదానంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

గూడెంకొత్తవీధిలో ఏర్పాట్లు

గూడెంకొత్తవీధి: ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని గిరిజన ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు పాతూని రామరాజు పడాల్ అన్నారు. మండల కేంద్రంలోని కల్యాణమండపం వద్ద శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి ఏర్పాట్లు చేశామన్నారు. వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం నాయకుడు లోచలి రామకృష్ణ, కొర్రమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఈఎంఆర్ఎస్‌లో మిగులు పోస్టులకు ఇంటర్వ్యూలు రేపు

పెదబయలు, ఆగస్టు 8 (ఆంధ్ర జ్యోతి): పెదబయలు, ముంచంగిపుట్టు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ టీచర్స్ పోస్టుల భర్తీకి ఆదివారం వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్స్ అమిత్ కుమార్ ఆనంద్, సుమన్ కుమారి ఓ ప్రకటనలో తెలిపారు. పెదబయలులో టీజీటీ అర్హతతో పీఈటీ-1 (మహిళ), సంగీతం- 1 అలాగే ముచంగిపుట్టు పాఠశాలలో టీజీటీ అర్హతతో పీఈటీ- 1 (మహిళ), సంగీతం- 1, ఆర్ట్- 1, వార్డెన్- 1(మహిళ) పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆయా కేటగిరీల్లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఉదయం 9 గంటలకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. పీజీటీ పోస్టుల ఇం టర్వ్యూలు తాత్కాలికంగా నిలుపు చేస్తూ ఎన్‌ఈఎస్‌టీఈ ఉన్నత స్థాయి అధికారులు ఆదేశాలు జరీ చేశారని వెల్లడించారు.

జోరుగా రాఖీల విక్రయాలు



అరుకులో దుకాణాల వద్ద కొనుగోలు దారుల రద్దీ

అరకులోయ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అరకులోయలో శుక్రవారం పండగ వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి దుస్తులు, రాఖీల కోనుగోలుకు జనాలు వచ్చారు. సాయంత్రం దుకాణాల పండగ వాతావరణం నెలకొంది. శనివారం రాఖీ పౌర్ణమి కావడంతో యువతీ, యువకులు రాఖీలను కొనుగోలు చేశారు. మూడురోజులపాటు సెలవులు కలిసి రావడంతో కళాశాలలో ఉన్న విద్యార్థులు ఇళ్లకు వెళ్లారు. శ్రావణ శుక్రవారం కాడంతో మహిళలు వరలక్ష్మీవ్రతం చేశారు

'పంచాయతీలపై పూర్తిస్థాయి సమాచారం ఇవ్వలేదు'

ముంచంగిపుట్టు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన నిధులపై సమాచార హక్కు చట్టంలో భాగంగా దరఖాస్తు చేసుకుంటే రెండునెలలు తరువాత అసమగ్ర సమాచారం ఇచ్చినట్టు కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ వైస్ చైర్మన్ వేంగడ నీలకంఠం ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పంచాయతీలకు కేటాయించిన నిధులపై స్పష్టత లేదని, ముఖ్యంగా సుజనకోట పంచాయతీ కేటాయించిన నిధులపై వివరాలు సక్రమంగా లేవన్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

చింతపల్లిలో భారీ వర్షం

చింతపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండు గంటల వరకు కుండపోత వాన పడింది. దీంతో రహదారులన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలు, పంట పొలాల్లో వర్షం నీరు చేరింది. కాగా భారీ వర్షం పడడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక మండల పరిదిలోని లోతుగెడ్డ జంక్షన్, తాజంగి, లంబసింగి ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది.



చింతపల్లిలో కురుస్తున్న వర్షం



మర్దిగుడ-లక్ష్మీపురం రోడ్డులో కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

పొంగిన గెడ్డ.. రాకపోకలు అంతరాయం

అనంతగిరి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గత రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గెడ్డలు, వాగులు పొంగిప్రవహిస్తున్నాయి.. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలోని ఒక్కసారిగా భారీ వర్షం పడడంతో మర్దగుడ- లక్ష్మీపురంగ్రామాలకు వెళ్లేమార్గమధ్యంలో గెడ్డపొంగి కాజ్‌వేపైనుంచి భారీగా వరదనీరు ప్రవహించింది. దీంతో పలు గ్రామాలకు సుమారు మూడు గంటలపాటుగా రాకపోకలకు నిలిచిపోయాయి. లక్ష్మీపురంతోపాటు రాజుపాక, డెక్కాపురం, తదితర గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు 13 మంది ఎంపిక



పోటీలకు ఆంధ్రప్రదేశ్ పవర్ సెక్టార్ తరపున ఎంపిక చేసిన జట్టు

సీలేరు, ఆగస్టు 8 , (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సీలేరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ముగిశాయి. ఈ పోటీలో అత్యంత ప్రతిభను కనబర్చిన 13 మంది క్రీడాకారులను 47వ ఆల్ ఇండియా కబడ్డీ టోర్నమెంట్‌కు స్పోర్ట్స్ ఆఫీసర్ డీడీ కుమార్ వడివేలు ఎంపిక చేశారు. ఇందులో సీలేరు జట్టులోని శ్రీనివాస్, సంతాన శ్యామ్యూల్ (వండు) కొండల శ్రీనివాసరావు 47 వ ఆల్ ఇండియా కబడ్డీకి ఎంపిక కావడం విశేషం. కబడ్డీలో విజేతగా నిలిచిన పల్నాడు జట్టు నుంచి రత్నరాజు, మల్లికార్జున, అచ్యుత్, నెల్లూరు జట్టు నుంచి రాజశేఖర్, సందీప్, గోవింద్, ఆర్‌టీపీపీ నుంచి ఓబిలేష్, శ్రీకాకుళం జట్టు నుంచి నాయుడు, తిరుపతి జట్టు నుంచి శేశాద్రి, కుమార్‌లు ఎంపికైన వారిలో ఉన్నారు. ఈ జట్టుకు సీలేరుకు చెందిన కింసా లా మా, ఏలూరుకు చెందిన విజయ్ మేనేజర్లుగా వ్యవహరిస్తారని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ స్పోర్ట్ కౌన్సిల్ స్పోర్ట్స్ ఆఫీసర్ డీడీ కుమార్ వడివేలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 47 వ ఆల్ ఇండియా కబడ్డీ టోర్నమెంట్‌ను తెలంగాణలోని అక్కడి ఎలక్ట్రిసిటీబోర్డు మాదగిరిగుట్టలో సెప్టెంబరు ఒకటి నుంచి నాలుగో తేదీ నిర్వహిం చనునట్టు చెప్పారు. ఈ పోటీలకు ఇక్కడ ఎంపిక చేసిన జట్టు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ తరపున ఆడుతుందని చెప్పారు.

ప్రత్యేక వైద్య నిపుణుల పోస్టుల భర్తీకి చర్యలు : డీసీహెచ్ఎస్



మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ నీలవేణి

చింతపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనున్న సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్యనిపుణుల భర్తీకి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం. నీలవేణి అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో రంపచోడవరం, చింతపల్లి, అరకులో ఏరియా ఆస్పత్రులు, ముంచంగిపుట్టు, కూనవరం, అడ్డతీగల, వై.రామవరం, చింతూరులో సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం తాజాగా ఏరియా ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్య నిపుణుల పోస్టులను భర్తీ చేసినట్టు చెప్పారు. సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. ఏరియా ఆస్పత్రి, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీల వివరాలను తాజాగా డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కి అందజేశామన్నారు. ప్రత్యేక వైద్యనిపుణుల పోస్టుల భర్తీలో గిరిజన ప్రాంతానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని డైరెక్టర్ హామీ ఇచ్చారన్నారు. ఏహెచ్, సీహెచ్‌సీల్లో రోగులకు వైద్యులు అన్నివేళలా అందుబాటులో ఉండాలని కచ్చితమైన ఆదేశాలు జారీచేశామన్నారు. అలాగే, ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగిందన్నారు. రోగుల తాకిడి అధికంగా ఉందన్నారు. రోగులకు ఆస్పత్రుల్లో మెరుగైన సదుపాయాలు కల్పిస్తూ సకాలంలో చికిత్స అందిస్తున్నామన్నారు. గిరిజన ప్రజలు ఏహెచ్, సీహెచ్‌సీల సేవలనుసద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోగులు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులతో రావాలి

» ఏహెచ్ ఆరోగ్యశ్రీ ఇన్‌చార్జి డాక్టర్ రమేశ్



మాట్లాడుతున్న ఏహెచ్ రమేశ్

చింతపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చే రోజులు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులను విధిగా తీసుకొని రావాలని ఆరోగ్యశ్రీ ఇన్‌చార్జి డాక్టర్ వి. రమేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమాన్ని అమలులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ మేరకు రోగుల ఆధార్ కార్డు ఆధారంగా అభా (ఏబీహెచ్‌ఏ) నంబరు క్రియేట్ చేయాల్సి ఉందన్నారు. రోగులకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. రోగుల్లో మెజారిటీ ఆదివాసీలకు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు లేవని చెబుతున్నారన్నారు. ఈనేపథ్యంలో మండల పరిషత్, గ్రామ సచివాలయం ఉద్యోగులు ప్రత్యేక చొరవ తీసుకుని శివారు గ్రామాల్లో నివాసం ఉంటున్న గిరిజనులకు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్డులు లేక సాంకేతికపరమైన సమస్యలు ఎదుర్కోవాల్సివస్తుందన్నారు. ప్రజలు ఈవిషయాన్ని గమనించాలని ఆయన తెలిపారు.

ఆదుకోవాలని గిరిజన యువకుడి అభ్యర్థన



నాటు తుపాకీ మిస్‌ఫైర్‌తో గాయపడిన బాలరాజు

ముంచంగిపుట్టు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమడ పంచాయతీ బూరుగుమెట్ట గ్రామానికి చెందిన వంతాల బాలరాజు అనే యువకుడు పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని నిర్మలూరు చేపలచెరువు వద్ద పని కోసం వెళ్లాడు. చెరువులోని పిట్టలను గన్‌తో కాల్చేపనిని అక్కడ కల్పించారు. అనుభవం లేకపోవడం నాటు తుపాకీ మిస్ఫైర్ కావడంతో బాలరాజు శరీరభాగమంతా కాలిపోయింది. దీంతో తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చిక్సితపొందుతున్న బాలరాజు.. శుక్రవారం ముంచంగిపుట్టు మండలంలోని విలేకరులకు ఫోన్‌చేసి జరిగిన విషయం చెప్పాడు. పని కల్పించేందుకు తీసుకువెళ్లిన తాపీమేస్త్రీ బస్సీ, చేపలచెరువు యాజమాని కనీసం పట్టించుకోవడం లేదని, కాలిన గాయాలతో నరకం అనుభవిస్తున్నానని, తనను ఆదుకోవాలంటూ బోరున విలపించాడు.. దాతలు ఎవరైనా ఫోన్ పే నంబర్ 80746 51560 సాయం చేయాలని అభ్యర్థించాడు.

గిరిజన రైతులకు ఉద్యానవన మొక్కలు



గిరిజనులకు మొక్కలు అందిస్తున్న దృశ్యం

గూడెంకొత్తవీధి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఆదివాసీ రైతులకు ఉద్యాన పంటల మొక్కలను ఉచితంగా అందజేస్తున్నారు. శుక్రవారం మండలంలోని గొందిపల్లి, కొత్తూరు గ్రామాల్లో జీకేవీధి ఉప సర్పంచ్ కొర్ర రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ వంతల లక్ష్మణరావు రైతులకు సిల్వర్ ఓక్ మొక్కలను పంపిణీ చేశారు. ప్రభుత్వం ఆదివాసీ రైతులను గంజాయికి ప్రత్యామ్నయంగా ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తోంది. ఈమేరకు ఉపాధి పథకం ద్వారా 20రకాల ఉద్యాన మొక్కలు రైతులకు అందించడంతోపాటు మూడేళ్లపాగు సాగు ప్రోత్సాహాలను సమకూర్చుతోంది మేట్ కొర్ర అప్పారావు, పెసా కమిటీ కార్యదర్శి వంతల జగత్‌రావు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ సందడి



అరకులోయ డిగ్రీ కళాశాలలో ఆటలపోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

అరకులోయ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తుండడంతో పాఠశాలలు, కళాశాలలో సందడి కనిపిస్తోంది. స్థానిక ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాలలో ఆటల పోటీలను నిర్వహిస్తున్నారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆటల పోటీలను ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్‌నాయక్ శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థిని, విద్యార్థులకు పీడీ అప్పారావు ఆధ్వర్యంలో పలు ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్టు స్పోర్ట్సు ఇన్‌చార్జి నాగబాబు తెలిపారు. గెలుపొందిన విజేతలకు ఆగస్టు 15 రోజున బహుమతులు అందిస్తామన్నారు. బాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. మహిళా డిగ్రీ కళాశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మండలంలోని పాఠశాలల్లో హెచ్‌ఎంల పర్యవేక్షణలో ఆటలపోటీలు కొనసాగుతున్నాయి.

రాజన్నపేటలో క్వారీపై చర్యలు తీసుకోవాలి

» జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు



గ్రామస్థులతో కలిసి క్వారీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పీవీఎస్ఎన్ రాజు

రోలుగుంట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, మైనింగ్ అనుమతులు లేకుండా రాజన్నపేటలో క్వారీ నిర్వహిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు కోరారు. శుక్రవారం ఆ గ్రామస్థులతో కలిసి క్వారీ ప్రాంతాన్ని పరిశీలించారు. క్వారీలో రిగ్ బ్లాస్టింగ్ చేస్తుండడంతో సమీప గ్రామంలో ఉన్న ఇళ్లకు బీటలు పడి దెబ్బతినడం పరిశీలించామన్నారు. అలాగే సమీప పంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. క్వారీ కాలుష్యంతో గ్రామస్థులు తీవ్ర శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే అనేక మార్లు కలెక్టర్, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే క్వారీ ప్రాంతంలోనే నిరసన దీక్షలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు బలిజి మహారాజు, బుంగా కోటి, ఇటంశెట్టి ఈశ్వరరావు, దిమిలి సత్య, కేసరపూడి శివాజీ, వజ్రపు రమేశ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినూత్న నిరసన



లోసింగిలో అడ్డాకులతో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న గిరిజనులు

రోలుగుంట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఉత్సవాలు నిర్వహించడం కాకుండా తమ సమస్యలు పరిష్కరించాలని లోసింగిలో గిరిజనులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈమేరకు అడ్డాకులు కట్టుకుని అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఐదు కిలోమీటర్లు డోలీ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జాజులబంధ, పిత్రిగెడ్డ, పెద్దగరువు, లోసింగి గ్రామాల ఆదివాసీలు మాట్లాడుతూ తమ గ్రామాల్లో తాగునీటి సౌకర్యం, అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య కేంద్రం లేక అనేక కష్టాలు ఎదుర్కొంటున్నామన్నారు. గతంలో తాము సొంతంగా చందాలు వేసుకుని రోడ్డు నిర్మాణం చేసుకోగా, అది వర్షాలతో పూర్తిగా కొట్టుకుపోయిందని వాపోయారు. రోడ్డు నిర్మాణానికి మంజూరైన రూ.కోటి నిధులతో చేపట్టిన పనులు మధ్యలో నిలిచిపోయాయని వీరు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు, పీవీటీసీ సంఘం కార్యదర్శి కామేశ్వరరావు, గ్రామస్థులు కొర్రా రాజు, తాంబేలి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కోనాం పరిసరాల్లో భారీ వర్షం

చీడికాడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాం, మంచాల, శిరిజాం, చీడికాడతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. కొద్దిరోజులుగా ఎండలకు మెట్ట ప్రాంతాల్లో వరి ఆకులు ఎండిపోయి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ పరిస్థితిల్లో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి వరిఆకుమడుల్లో నీరుచేరడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.



దేవరాపల్లిలో కురుస్తున్న వర్షం

మాడుగులలో..

మాడుగుల: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో ఎండలతో అవస్థలు పడుతున్న జనాలకు ఉపశమనం లభించింది. ఎండిపోయే స్థితిలో వ్యవసాయ పంటలు మేలు చేసిందని రైతులు తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు

దేవరాపల్లి: మండలంలో శుక్రవారం సాయంత్రం కుండపోత వర్షం పడింది. దీంతో రైతులు హర్షం వ్యక్తంచేశారు. గత 15 రోజుల నుంచి వర్షాలు లేక వరి నాట్లు, వరి నారుమడులు, సరుగుడు నాట్లు,కూరకాయల పంటలు ఎండిపోతున్న తరుణంలో శుక్రవారం కురిసిన వర్షం ఊపిరిపోసినట్లయింది.



శిరిజాంలో ఆకుమడిలో నీరుచేరిన దృశ్యం

గొలుగొండలో...

గొలుగొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వర్షం కురిసింది. పప్పుశెట్టిపాలెం, చీడిగుమ్మల, జోగంపేట, పాకలపాడు, రావణాపల్లి, ఏటిగైరంపేట, జానకిరాంపురం తదితర గ్రామాల్లో మోస్తరు వాన పడింది. దీంతో ఆయా గ్రామాల్లో వరి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

చోద్యంలో రూ.60 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ రాజేశ్

కృష్ణాదేవిపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని చోద్యం గ్రామంలో రూ.60 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డు నిధులతో చోద్యం జంక్షన్ నుంచి జడ్పీ హైస్కూల్ వరకు సీసీరోడ్డు నిర్మించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, నాయకులు చిటికెల సాంబమూర్తి, ఆదపురెడ్డి ప్రభాకర్, అడిగర్ల స్వామినాయుడు, దేవాడ శేషు, చెన్నారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాకవరపాలెం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఏఈ భూషణం తెలిపారు. మాకవరపాలెం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మండల పరిషత్ ఏరియా, మాకవరపాలెం మెయిన్ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, రాజరావుపేట, కొత్తవీధి పట్టాలమ్మ తల్లివీధి, స్టేట్ బ్యాంకు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.



తుప్పలు, డొంకల మధ్య నడుస్తున్న నీటిని తెస్తున్న మహిళలు



ఊటగెడ్డలో నీటిని సేకరిస్తున్న దృశ్యం

కొత్తవీధిలో సమస్యలెన్నో..

» గిరిజనులకు తాగునీరు కరవు » ఊటగెడ్డనీరే గతి

» రహదారి సౌకర్యం లేక విద్య, వైద్యానికి దూరం

» పట్టించుకోని పాలకులు, అధికారులు

చీడికాడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాం శివారు కొత్తవీధి గిరిజన పీటీజీ గ్రామంలో సమస్యలు తాండవిస్తున్నాయి. గత 30 ఏళ్లగా సురక్షిత తాగునీరు లేక గ్రామానికి దూరంగా ఉన్న ఊట గెడ్డ నీటిని తెచ్చుకుని వినియోగిస్తున్నారు. పొట్టకూటికోసం ఏజెన్సీకి చెందిన జి.మాడుగుల మండలం నుంచి వలన వచ్చిన గిరిజనులు కోనాం గ్రామానికి ఐదుకిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో సుమారు పది కుటుంబీకులం నివాసం ఏర్పాటుచేసుకుని ఉంటున్నాయి. అటవీ ఫలసాయంతోపాటు కూలిపనులు చేసుకుంటూ జీవిస్తు న్నారు. కనీసం తాగడానికి మంచినీరు లేకపోవడంతో కొత్తవీధి గ్రామ సమీపంలోని ఊటగెడ్డ నీటిని సేకరిస్తున్నారు. ఈ నీటిని రోజూ వేడిచేసుకుని వినియోగిస్తున్నారు. ఈ నీటితో వ్యాధుల పాలవుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.. అలాగే, కోనాం నుంచి గుంటు వరకు రెండు కిలో మీటర్లు మేర తారు రోడ్డు సదుపాయం ఉన్నా, అక్కడి నుంచి సుమారు మూడు కిలోమీటర్లు రహదారి సదుపాయంలేదు. దీంతో పొలాలు, తు ప్పలతో ఉన్న మట్టిరోడ్డులో ప్రయాణించాల్సి వస్తోందని గిరిపుత్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గుంటు గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లేందుకు పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. ఐదేళ్లు నిండిన పిల్లలను మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న గుంటు కొత్తూరు పాఠశాలకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో చోడవరంలో ఉన్న ప్రేమ సమాజానికి పంపిస్తున్నారు. ఇక, గర్భిణులకు, గ్రామస్థులకు ఎటువంటి అనారోగ్య సమస్య తలెత్తినా సమస్య ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయాల్లో గర్భిణులు, రోగులను ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు డోలీమోత సహాయంతో తమ గ్రామం నుంచి మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న గుంటు గ్రామానికి తీసుకువెళ్లాల్సి వస్తుందని తెలిపారు. కోనాం నుంచి రేషన్ బియ్యం, నిత్యావసర సరకులను భుజాలపై మోసుకురావాల్సి వస్తోందని చెబుతున్నారు. అధికారులకు, పాలకులకు ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోలేదని గిరిజనులు 'ఆంధ్రజ్యోతి' ఎదుట వాపోయారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కనకమ్మని వివరణ కోరగా, కొత్తవీధి గ్రామం పక్కన ఒక గరువులో బోరుని నిర్మించామన్నారు. స్థానిక రైతు మండల కొండబాబు అభ్యంతరం తెల పడంతో ఈ పనులు నిలిచిపోయాయని, ఈ సమస్యను పరిష్కరించి త్వరలో తాగునీరు అందజేస్తామని ఆమె తెలిపారు.

గెడ్డనీటిని వేడిచేసి తాగుతున్నాం



ఊటగెడ్డ నీటిని తెచ్చుకుని వేడిచేసి తాగుతున్నాం. ఆ నీటితో వ్యాధులు ప్రబలుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లో ఉపయోగించాల్సి వస్తోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

-కిల్లో దేవి, కొత్తవీధి

డోలీ మోతలు తప్పడంలేదు



తమ గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల వరకూ రహదారి సదుపాయం లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులకు, నాయ కులకు ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోలేదు.

-గెమ్మిలి బాలరాజు, కొత్తవీధి

సెస్ వసూలుతోనే అభివృద్ధి సాధ్యం

» మాడుగుల ఏఎంసీ కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



ప్రమాణస్వీకార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీల అభివృద్ధి సెస్‌తోనే సాధ్యమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి చెప్పారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపం ప్రాంగణంలో శుక్రవారం జరిగిన ఏఎంసీ చైర్‌పర్సన్ పుప్పాల అప్పలరాజు ప్రమాణస్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, మాడుగుల మార్కెట్ పరిధిలో ఉన్న రైతాంగానికి అన్ని విధాలుగా ఆదుకునేలా అనుభవం కలిగిన వ్యక్తి పుప్పాల అప్పలరాజుని చైర్‌పర్సన్‌గా నియమించామన్నారు. రైతులు పండించే పంటల నిల్వకు కోల్డు స్టోరేజీలను ఏర్పా టుకి చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. వ్యయసాయ మార్కెట్ కమిటీ భవనం, ప్రహరీ నిర్మాణాలకు అవసరమైన రూ. 65లక్షలతో ప్రతిపాదనలను పంపించినట్టు చెప్పారు. సిబ్బంది కొరత తీరుస్తామని తెలిపారు. మాడుగుల ఏజెన్సీ ముఖద్వారం ఇక్కడి వ్యాపారులు ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లి అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసి, పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నా ఒక్క రూపాయికూడా సెస్ చార్జీలు చెల్లించడంలేదని గుర్తించామన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ పుప్పాల అప్పలరాజు వీటి వసూలుపై దృష్టి సారించి, వ్యవసాయ మార్కెట్ కమిటీని అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. తాటిపర్తి సమీపంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ తరపున చెక్‌పోస్టు చేయాలన్నారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ పనితీరు మెరుగు పరిచి రైతుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పుప్పాల అప్పలరాజు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానన్నారు. ఏ ఎంసీని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ఆయనను ఎమ్మెల్యే బండారు, తాతయ్యబాబు, ఎంపీపీ రాజారాం, జడ్పీటీసీ రమణమ్మ, సర్పంచ్ కళావతి పలువురు సాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అద్దెపల్లి జగ్గారావు, కిలపర్తి భాస్కరరావు, పుట్టా గంగయ్య, ఏడీఅశోక్ కుమార్ ఏఎంసీ పాలకవర్గ సభ్యులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీదేవి వ్రతాలు

చోడవరం/రావికమతం/ బుచ్చెయ్యపేట/ మాడుగుల ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం మూడోశుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రావికమతం మండలం చినపాచిల శ్రీవైష్ణదేవి ఆలయంలో వ్యవస్థాపకుడు ఆరవెల్లి సత్యనారాయణ ఆచార్యులు, వాసుదేవాచార్యులు, శ్రీలక్ష్మీ సత్యనారాయణస్వామి ఆలయంలో ఆరవెల్లి వెంకట రామ గోపాలాచార్యులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. బుచ్చెయ్యపేట మండలంలో గ్రామాలలో వరలక్ష్మి వ్రతాలు ఘనంగా నిర్వహించారు.మాడుగులలో శ్రావణమాస శుక్రవారం పూజలు చేశారు. సందర్భంగా లక్ష్మీదేవికి ప్రత్యేకంగా అలకంరించారు. అనంతరం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే చోడవరంలోని దుర్గాదేవి, లక్ష్మమ్మ కోవెలకు భక్తులు ఉదయం నుంచి తరలివచ్చి పూజలు చేశారు. రహదారులపై శ్రావణం సందడి నెలకొంది. ఇళ్ల వద్ద అమ్మవారిని ముస్తాబు చేసి లక్ష్మీదేవికి పూజలు చేశారు.



వరలక్ష్మీదేవి పూజలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులు



చినపాచిల శ్రీవైష్ణవి దేవి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు

నర్సీపట్నంలో...

నర్సీపట్నం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వరలక్ష్మీదేవి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు, చింతకాయల రాజేశ్, దివ్యశ్రీ దంపతులు వారి నివాసంలో వరలక్ష్మీదేవి వ్రతంలో పాల్గొన్నారు. పూజలో పాల్గొన్న మహిళలకు తాంబూలం, ప్రసాదం అందజేశారు

కోనాంలో పారిశుధ్య పనులు



కోనాంలో చెత్తచెదారం తొలగిస్తున్న కార్మికులు

చీడికాడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం గ్రామ ప రిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని డిప్యూటీ ఎంపీడీవో సీహెచ్.చంద్రశేఖరరావు అన్నారు. శుక్రవారం గత రెండు రోజులనుంచి గ్రామంలో పారిశుధ్య కార్మికులతో పనులు చేయిస్తున్నారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ, శనివారం కలెక్టర్ కోనాం రానున్న దృష్ట్యా అన్ని వీధులు చెత్త తొలగించి, డ్రైనేజీల్లో శుభ్రంచేయిస్తున్నామని తెలి పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎస్.సిం హాచలం నాయుడు, కె.నాగేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

నేడు కోనాంలో అంతర్జాతీయ గిరిజన ఉత్సవం



ధింసా కళాకారులతో మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి మంగవేణి

చీడికాడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాంలో శనివారం జరిగే అంతర్జాతీయ గిరిజన ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్టు గిరిజన సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిత అధికారిణి జి.మంగవేణి తెలిపారు. శుక్ర వారం కోనాంలో జరుగుతున్న పనులను డీఈవో గిడ్డి అప్పారావునాయుడుతో కలిసి పరిశీలించారు. మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో కొంతవరకూ ఏర్పాట్లు నిలిచిపోయాయని, వర్షం తగ్గిన తరువాత ఏర్పాట్లు పూర్తిచేస్తామని ఆమె తెలిపారు. శనివారం ఉదయం జరిగే ఈ ఉత్సవానికి జిల్లా కలెక్టర్‌తోపాటు జిల్లాలోని ప్రజాప్రతినిధులను ఆహ్వానించామని ఆమె తెలిపారు. ఈ మేరకు ధింసా నృత్యకళాకారులను ఏజెన్సీ మండలాల నుంచి ఇప్పటికే రప్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.హేమసుందరరావు, ఎంఈవోలు కె.బొంజుబాబు, బి.వి.రమణ, స్థానిక హెచ్ఎం యు.వి.రమణమూర్తి, రిటైర్డ్ హెచ్ఎం చలుగు జగన్నాధంనాయుడు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక

అనకాపల్లి టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నేతృత్వంలో ఈ నెల 29న క్రీడా పోటీలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా శుక్రవారం గవరపాలెం దిబ్బవీధి కొబ్బరి తోటలో వాలీబాల్ బాల, బాలికల జట్ల ఎంపికను శాప్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 50 మంది బాలురు, 16 మంది బాలికలు హాజరయ్యారు. వీరిలో బాలురు విభాగంలో 25 మంది బాలురును ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 13 వరకు శిక్షణ ఇస్తారు. వీరిలో ఎంపిక చేసిన 12 మంది క్రీడాకారులు విశాఖపట్నంలో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న జోనల్ పోటీల్లో పాల్గొంటారు. అక్కడ గెలుపొందిన జట్లు ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని డీఎస్‌డీవో ఎల్‌వీ.రమణ తెలిపారు. ఈ జట్లకు కోచ్ కమ్ మేనేజర్లుగా భీశెట్టి శ్రీనివాసరావు, విల్లూరి ప్రసాద్ వ్యవహరిస్తారు.

గాంధీగ్రామంలో కలుషిత నీరు సరఫరా!

చోడవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు గాంధీగ్రామం పంచాయతీ శాంతినగర్‌లో పంచాయతీ కొళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతున్నట్టు జనసేన మహిళా అధ్యక్షురాలు నరవ సరోజిని శుక్రవారం తెలిపారు. రెండు రోజుల పాటు కొళాయిల ద్వారా నీరు సరఫరా చేయలేదని, శుక్రవారం నీటి సరఫరా వచ్చినా, కొళాయిల నుంచి వచ్చిన నీరు కలుషితంతోపాటు దుర్వాసన రావడంతో తాగడానికి వీలు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం అధికారులు స్పందించి పంచాయతీలో తాగునీటి సరఫరా మెరుగుపరచడానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

సిమెంట్ బల్లలు వితరణ



వడ్డాది రెల్లి కాలనీ వాసులకు సిమెంట్ బల్లలు అందిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది అరుంధతి రెల్లికాలనీలో సిమెంట్ బెంచీ బల్లలను టీడీపీ నాయకులు, పంచాయతీ వార్డు సభ్యుడు దొండా నరేశ్ తన సొంత నిధులతో ఏర్పాటు చేశారు. శుక్రవారం వాటిని కాలనీ వాసులకు అందించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఇంటి అప్పారావు, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు పేరమ్మ, హైస్కూల్ కమిటీ చైర్మన్ కోవెల వెంకటరమణ, టీడీపీ నేతలు మంచాల గోవింద, సయ్యపురెడ్డి మాధవరావు, తలారి శంకర్, ఎం. నూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు అభినందన



డైరెక్టర్ అప్పలరాజును అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మాడుగులలో శుక్రవారం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేసిన దేవరాపల్లికి చెందిన బందం అప్పలరాజును ఎమ్మెల్యే బండారు.సత్యనారాయణమూర్తి అభినందించారు. అనంతరం అప్పలరాజు మాట్లాడుతూ, ఎంతో నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానన్నారు. మ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కిలపర్తి యూత్ అప్పలరాజును సన్మానించారు.

స్పీకర్ అయ్యన్న, మంత్రి అనిత పర్యటన ఏర్పాట్లు పరిశీలన

నాతవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 10న జరగనున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి వంగలపూడి అనిత పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు, నాయకులు శుక్రవారం పరిశీలించారు. తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, ఎస్‌ఐ సిహెచ్.భీమరాజు తదితరులు తాండవ వెళ్లి ఏర్పాట్లు చూశారు. నాతవరం, నర్సీపట్నం, కోటవురట్ల, తుని, రౌతులపూడి, కోటనందూరు మండలాల రైతులతో తాండవ డ్యామ్‌పై ఆదివారం సమావేశం నినిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను వారు స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, టీడీపీ నేత జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గిరిజన సంప్రదాయాలు కాపాడుకోవాలి



నినాదాలు చేస్తున్న గిరిజనులు

నాతవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంప్రదాయాలను కాపాడుకోవాలని గిరిమిత్ర సంఘం ప్రధాన కార్యదర్శి బండి గంగరాజు కోరారు. మండలంలోని సరుగుడు గ్రామంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానురాను గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదో షెడ్యూల్‌లో ఉన్న సరుగుడు తదితర గిరిజన గ్రామాలలో రాజ్యాంగం కల్పించిన హక్కులు గిరిజనులకు దక్కలేదన్నారు. సరుగుడు గ్రామాన్ని కొయ్యూరు మండలంలో కలపాలని ఆయన డిమాండ్ చేశారు.

దోమల నివారణ మందు స్ప్రేయింగ్

కృష్ణాదేవిపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని ఏఎల్.పురం పంచాయతీలో శుక్రవారం దోమ నివారణ మందును పిచికారీ చేశారు. సర్పంచ్ లోచల సుజాత, కార్యదర్శి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులతో గ్రామంలోని కాలువలు, ఇళ్ల వద్ద మందు స్ప్రేయిగ్ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో సీజన్ వ్యాధులు ప్రబలకుండా మందు జాగ్రత్తగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. రోగాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

రక్షానుబంధన్..



అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ప్రేమకు ప్రతిరూపం

- హాట్‌కేకుల్లా రాఖీలు, గిఫ్ట్ ఆర్టికల్స్ అమ్మకాలు
- రాఖీ కట్టడం, బహుమతులు ఇవ్వడమే కాకుండా ఎప్పుడూ ఒకరికొకరు అండగా ఉండాలి

నేడు రాఖీ పండుగ సందర్భంగా..

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

హిందూ ధర్మం చక్కని మార్గాన్ని చూపిస్తోంది. వేదాలలో వున్న సనాతన ధర్మాలను అవగాహన చేసుకుంటే నేటి సమాజంలో మనిషి మార్గానికి దిశానిర్దేశం అవగతమవుతోంది. ఇంటికి వచ్చి న ఆడపడుచును ఆదరించి పంపించాలనే హిందూ ధర్మానికి ప్రతీకగా రాఖీ (రక్షా బం ధన్) పండుగను చెప్పుకోవచ్చు. రక్షణ కోరిన మహిళకు రక్షాకవచంగా నిలుస్తానని సోదరుడు అభయమివ్వడమే రాఖీ పండుగ పరమార్థం. ఈ విధంగా రక్షాబంధనం సోదరభావాన్ని పంచుతోంది.

సోదరుని జీవితం తీపి మాదిరిగా ఎల్లప్పుడూ ఉండాలని.. తలపెట్టే ప్రతి కార్యం విజయవంతం కావాలని.. సకల సందపలు చేకూరాలని ఆకాంక్షిస్తూ తోబుట్టువులు సోదరుడి చేతికి కట్టేదే రక్షా బంధనం. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల బంధానికి ప్రతీకగా పిలిచే రాఖీ (రక్షా బంధన్) పండుగను ఏటా శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమి రోజున జరుపుకోవడం ఆనవాయితీ. సోదర, సోదరీమణుల మధ్య అంతులేని ప్రేమ, ఆప్యాయతలకు ప్రతీకగా ఈ పండగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. సోదరుడు ఆరోగ్యంగా ఉండడంతోపాటు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ, తమకు జీవితాంతం అండగా, రక్షణగా నిలవాలని కోరుకుంటూ అక్కాచెల్లెళ్లు ఈ రక్షా బంధనాన్ని కడుతుంటారు. శనివారం రక్షా బంధన్ సందర్భంగా ప్రత్యేక కథనం.

ఇదీ నేపథ్యం..

రక్షా బంధన్ వేడుకలను కొన్నేళ్ల నుంచి నిర్వహిస్తున్నారు. రాఖీ పండుగ నిర్వహణకు అనేక అంశాలను కారణాలుగా చెబుతారు.. విభిన్నమైన కథనాలూ ప్రచారంలో ఉన్నాయి. వ్యాస భగవానుడు రచించిన విష్ణు పురాణం ప్రకారం రాఖీ పౌర్ణమిని 'బలేవా' అని పిలుస్తారు. బలిచక్రవర్తి మహా విష్ణువు భక్తుడు. బలిచక్రవర్తి తన అపారమైన భక్తితో విష్ణుమూర్తిని తన వద్దే ఉంచుకుంటాడు. విష్ణుమూర్తి లేని వైకుంఠం



వెలవెలబోతుండడంతో ఆలోచించిన శ్రీమహాలక్ష్మి రాఖీ పౌర్ణమి రోజున బలిచక్రవర్తికి రాఖీ కట్టింది. అప్పుడు లక్ష్మీదేవిని ఏమి బహుమతి కావాలో కోరుకోమని బలిచక్రవర్తి అడుగుతాడు. అప్పుడు లక్ష్మీదేవి తనతో పాటు వైకుంఠానికి విష్ణుమూర్తిని పంపించాలని కోరగా ఆయన వెంటనే అంగీకరించాడు. అప్పటినుంచే రాఖీ కట్టే సంప్రదాయం ప్రారంభమైందని చెబుతారు. అలాగే మహాభారతంలో ద్రౌపది వస్త్రాపహరణ సమయంలో శ్రీకృష్ణుడిని తలచుకుంటుంది. అప్పుడు కృష్ణుడు సాయంతో ద్రౌపది అవమాన భారం నుంచి తప్పించుకుంటుంది. అన్నాచెల్లెళ్ల బంధానికి గుర్తుగా శ్రీకృష్ణుడికి ద్రౌపది రాఖీ కట్టిందని చెబుతారు. వీటితోపాటు అనేక కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఇలా ఎన్ని కథనాలు ప్రచారంలో ఉన్నా సోదరీ, సోదరుని బంధానికి గుర్తుగా రాఖీని జరుపుకుంటున్నాం.





రాఖీ అంటే..

రాఖీ అంటే రక్షణ అని అర్థం. తమ సోదరులకు ఎలాంటి ఆపదలు, అవాంతరాలు రాకుండా జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని కాంక్షిస్తూ ప్రతి ఆడపడుచు తన అన్నదమ్ములకు కట్టే రక్షను రాఖీగా చెబుతారు. తమ శ్రేయస్సును, అభ్యున్నతిని కోరుకునే అక్కాచెల్లెళ్లకు రాఖీ పండుగ సందర్భంగా కానుకలు ఇచ్చి సంతోషంగా ఉండేలా చేయడం ఆనవాయితీగా వస్తోంది.

రక్ష బంధన్ సందడి..

రక్షా బంధన్ పండుగ నేపథ్యంలో వివిధ రకాల రాఖీల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గత వారం రోజుల నుంచి నగర పరిధిలోని అనేకచోట్ల భారీగా రాఖీల విక్రయ వ్యాపారం జరుగుతోంది. విభిన్నమైన రాఖీలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. వందలాది మంది వ్యాపారులు వివిధ ఆకృతులు, డిజైన్లతో కూడిన రాఖీలను విక్రయిస్తున్నారు. రూ.ఐదు నుంచి వందల రూపా యల ఖరీదు చేసే రాఖీలు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. రక్షా బంధన్‌ను పురస్కరించు కుని విభిన్నమైన గిఫ్ట్ అమ్మకాలు కూడా జోరుగా సాగుతున్నాయి. అనేకచోట్ల రక్షా బంధన్ స్పెషల్ గిఫ్ట్‌లు, ఫొటో ఫ్రేమ్స్, చాక్లెట్ బాక్సులు, నేమ్ బోర్డులు, ఇతర ఖరీదైన బహుమతులను అమ్ముతు న్నారు. శుక్రవారం ఎక్కడ చూసినా రాఖీలను కొను గోలు చేస్తూ మహిళలు, యువతులే కనిపించారు.

స్ఫూర్తిని ఇచ్చేలా ఉండాలి

రాఖీ పండగ రోజు చేతికి రాఖీ కట్టడమో, సోదరికి ఖరీదైన బహుమతిని ఇవ్వడమో రక్షా బంధన్ కాదు. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా ఉండడమే అసలైన రాఖీ పండగ పరమార్థం. ఇద్దరిలో ఎవరు కష్టాల్లో ఉన్నా అండగా నిలవడమే అసలైన ఉద్దేశం. ఇలా కష్టాసుఖాల్లో తోడున్నప్పుడే ఈ పండుగకు అసలైన సార్థకత లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆర్థిక సంబంధాలను ఆధారంగా చేసుకుని బంధాలను కొనసాగిస్తున్న వారెందరో ఉన్నారు. నిజమైన బంధాలను నిలుపుకునేవాళ్లు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తారు. అటువంటి ఆదర్శమైన సోదరీ, సోదరీమణులుగా నిలిచేందుకు ప్రతిఒక్కరూ ప్రయత్నించాలి. సోదరి కట్టే రాఖీ బంధనం ఎల్లవేళలా తాను అండగా ఉంటానని చెబుతోంది.. మరి అటువంటి అక్కాచెల్లెళ్లకు ఎంతమంది సోదరులు అండగా ఉంటున్నారన్నది కూడా ఎవరికి వాళ్లు ప్రశ్నించుకోవాలి.

క్రైం... crime news

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం వృద్ధురాలు మృతి చెందినట్టు ట్రాఫిక్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. గురువారం ఉదయం స్థానిక సబ్‌జైలు జంక్షన్ వద్ద నరసింగరావుపేటకు చెందిన కొడమంచిలి అచ్చియ్యమ్మ (65)అనే వృద్ధురాలిని నర్సీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం ఉదయం మృతి చెందినట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అప్పు తీర్చమని కోరుతున్నా దుర్భాషలాడి బెదిరిస్తున్న వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ ఎస్.భాస్కరరావు తెలిపారు. వేల్పులవీధికి చెందిన బి. భారతి తన స్నేహితుడైన తాకాశివీధికి చెందిన చింతల ప్రశాంత్‌కు ఏడాది క్రితం దపదఫాలుగా రూ. రెండు లక్షలు రుణంగా ఇచ్చిందన్నారు. ఆ డబ్బులను తిరిగి ఇమ్మని అడుగుతుంటే దుర్భాషలాడుతూ బెదిరిస్తున్నారని భారతి ఇచ్చిన ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

ఏఎల్‌పురం యువకుడి అదృశ్యం



లోకవరపు బుచ్చయ్య నాయుడు (ఫైల్)

కృష్ణాదేవిపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్‌పురం గ్రామానికి చెందిన లోకవరపు బుచ్చయ్య నాయుడు (32) అదృశ్యమైనట్టు తండ్రి చిట్టిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి.

ఏఎల్‌పురం గ్రామానికి చెందిన బుచ్చయ్యనాయుడు విశాఖపట్నంలోని ఎస్‌వీఎస్ రియల్ ఎస్టేట్, శుభగృహ రియల్ ఎస్టేట్ కంపెనీల్లో ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి 7 గంటలకు స్వగ్రామానికి బయలుదేరాడు. రాత్రి 9గంటలకు తాళ్లపాలెం నుంచి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి వస్తున్నట్టు తెలిపారు. అర్ధరాత్రి దాటినా రాలేదు. రెండు రోజులుగా బంధువులు, స్నేహితులు ఇళ్ల వద్ద వెళ్లి వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో కృష్ణాదేవిపేట పోలీసులకు శుక్రవారం సాయంత్రం తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు. ఈ వ్యక్తి ఎవరికైనా కనబడితే 9440904240, 7075331252, 8897852558 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ వై.తారకేశ్వరరావు కోరారు.

సెప్టెంబరు 5న డీఎస్‌ఎన్‌ఎల్‌యూ 12వ స్నాతకోత్సవం

సబ్బవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం 12వ స్నాతకోత్సవం సెప్టెంబరు 5వ తేదీన నిర్వహించనున్నట్టు వర్సిటీ వీసీ, ప్రొఫెసర్ డి సూర్యప్రకాశరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేరోజు 8, 9, 10, 11వ స్నాతకోత్సవాలు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయా సంవత్సరాల్లో కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులందరికీ ఈ స్నాతకోత్సవంలో డిగ్రీలు ప్రదానం చేస్తామన్నారు. డిగ్రీలు అందుకునేందుకు ఈనెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించి తెలుసుకోవాలని వీసీ సూచించారు.

సీఎం పాడేరు పర్యటనకు రెండో హెలిప్యాడ్ స్థలం పరిశీలన

మాడుగుల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాడేరు పర్యటనకు మండలంలోని తాటిపర్తి సమీపంలో ప్రత్యామ్నాయ హెలిప్యాడ్ కోసం స్థలాన్ని శుక్రవారం అధికారులు పరిశీలించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి హాజరవుతున్న ముఖ్యమంత్రి పర్యటనకు వాతావరణం అనుకూలంగా లేకుంటే హెలికాప్టర్ దిగడానికి తాటిపర్తి సమీపంలో ప్రత్యామ్నాయ హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా, నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ హెలిప్యాడ్ ప్రదేశాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ఎటువంటి అవరోధం లేకుండా చూడాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.ఈ కార్యక్రమమలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, అడ్వాన్స్ సెక్యూరిటీ లైజిన్ ఆఫీసర్ ఆర్‌పీఎల్.శాంతి కుమార్, డీఎస్పీలు ఎం.శ్రావణి, పి.నాగేశ్వరరావు, ఎస్‌బీ సీఐ బాల సూర్యారావు, కె.కోటపాడు సీఐ పైడపునాయుడు, వి.మాడుగుల ఎస్ఐ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.



తాటిపర్తి గ్రామానికి సమీపంలో ఏర్పాటు చేస్తున్న ప్రత్యామ్నాయ హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- విశాఖలో ముగిసిన రాష్ట్ర స్థాయి అండర్-19 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

పెదగంట్యాడ (విశాఖపట్నం), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. విశాఖలోని 65వ వార్డు పరిధి వికాస్‌నగర్ రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్, శాప్ సంయుక్తంగా మూడు రోజుల పాటు నిర్వహించిన అండర్-19 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని మరింత పెంచుకునేందుకు తగిన సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద రాజు, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ సీఈవో చుక్కా శ్రీనివాసరావు, కార్యదర్శి పల్లా శ్రీనివాసరావు, టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, కార్పొరేటర్ బొద్దు నరసింహపాత్రుడు, తదితరులు పాల్గొన్నారు. విజేతలకు అతిథులు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.



విజేతలతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, తదితరులు


విజేతలు వీరే..

షటిల్ బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో ఎండీ కరమత్ (ప్రకాశం జిల్లా), డి.దీపిక (గుంటూరు) ప్రథమ స్థానంలో, టి.కౌశిక్ (కర్నూలు), డి.స్రవంతి (గుంటూరు) ద్వితీయ స్థానంలో నిలిచారు. బాలికల సింగిల్స్‌లో ఎం.హాసనశ్రీ(కర్నూలు), ఎ.హారిక (విశాఖ) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. బాలుర సింగిల్స్‌లో విశాఖకు చెంది పి.బాల ప్రణయ్, ఎం.లక్ష్మీ వైశాక్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. అలాగే బాలికల డబుల్స్‌లో ఎం.హాసనశ్రీ (కర్నూలు), ఎ.హారిక (విశాఖ) ప్రథమ స్థానంలో, డి.దీపిక (గుంటూరు), డి.స్రవంతి (గుంటూరు) ద్వితీయ స్థానంలో, బాలుర డబుల్స్‌లో టి.చరణ్‌రామ్ (చిత్తూరు), వి.హరికృష్ణ (తూర్పుగోదావరి) ప్రథమ, పి.బాల ప్రణయ్ (విశాఖ), కె.మహీంద్ర (నెల్లూరు) ద్వితీయ స్థానాలను సాధించారు.

దిబ్బపాలెం రోడ్లు ఛిద్రం

... 5వ పేజీ తరువాయి

ఈ కాలనీలో సుమారు 4,500 కుటుంబాలు నివసిస్తున్నాయి. కాలనీలో ఏపీఐఐసీ రహదారులను నిర్మించింది. కాలనీలో నివసించే వారి వాహనాలతోపాటు విద్యా సంస్థలకు చెందిన వాహనాలు మాత్రమే ఈ రోడ్లపై రాకపోకలు సాగించాలి. అయితే అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ వంతెన నిర్మిస్తుండడంతో అచ్యుతాపురం జంక్షన్ నుంచి పూడిమడక వైపు సెజ్ కర్మాగారాలకు వెళ్లే రోడ్డును అధికారులు మూసేశారు. దీంతో అచ్యుతాపురం, వెదురువాడ, వెంకటాపురం జంక్షన్, సెజ్ పునరావాస కాలనీ మీదుగా వాహనాలను మళ్లించారు. సెజ్ కర్మాగారాలకు ఉద్యోగులను తీసుకువెళ్లే సుమారు 200 బస్సులు, యంత్రాల విడిభాగాలు, ముడి సరుకుతోపాటు సెజ్ కర్మాగారాల ఉత్పత్తులను రవాణా చేసే భారీ వాహనాలు సెజ్ పునరావాస కాలనీ మీదుగా 24 గంటలూ రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో పలుచోట్ల రహదారి కుంగిపోయి పూర్తిగా ఛిద్రమైంది. కొన్నిచోట్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వర్షం కురిస్తే రహదారి మొత్తం బురదయమం అవుతున్నది. గోతుల్లో నీరు చేరి సాధారణ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ గోతుల్లో వాహనాలు కూరుకుపోయి ట్రాఫిక్ స్తంభిస్తున్నది. వరుసగా రెండు, మూడు రోజులపాటు వర్షం పడకపోతే రహదారిపై దుమ్ము, ధూళి లేస్తున్నది. దీనివల్ల కాలనీ వాసులు, ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



నాయనమ్మపాలెం వద్ద ఆనవాళ్లు లేని సిమెంట్ రోడ్డు

రేషన్ బియ్యం పట్టివేత

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. దీంతో హెచ్‌డీటీ వినయ్‌కుమార్, సిబ్బందితో కలిసి ఏటికొప్పాకకు బయలుదేరారు. దారిలో రైల్వే గేట్లు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని అడ్డుకుని తనిఖీ చేశారు. ఒక్కొక్కటి 50 కిలోల బరువున్న 130 బియ్యం బస్తాలు కనిపించాయి. ఈ బియ్యాన్ని పులపర్తి వైపు తరలిస్తున్నట్టు తమ ప్రాథమిక విచారణలో తేలిందని హెచ్‌డీటీ చెప్పారు. రేషన్ బియ్యంతోపాటు లారీని స్వాధీనం చేసుకుని ఎలమంచిలి తరలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్‌డీటీ వినయ్‌కుమార్ తెలిపారు.

నేడు సీఎం చంద్రబాబు రాక

... 5వ పేజీ తరువాయి

మోహరించారు. వీరి వెంట వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు వున్నారు.

సీఎం పర్యటన వివరాలు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం ఉదయం ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10 గంటలకు లగిశపల్లిలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో బయలుదేరి 10.25 గంటలకు వంజంగి గ్రామానికి వెళతారు. ఇక్కడ 11.40 గంటల వరకు గిరిజన సంప్రదాయాలు, పండగలపై గిరిజనులతో, కాఫీ తోటల్లో రైతులతో ముచ్చటిస్తారు. తరువాత ప్రధాన వేదిక వద్దకు చేరుకుంటారు. మధ్యాహ్నం 1.05 గంటల వరకు ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రసంగిస్తారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. అనంతరం లగిశపల్లికి సమీపంలో కూటమి నేతలు, కార్యకర్తలతో 2.20 గంటల వరకు సమావేశమవుతారు. అనంతరం హెలికాప్టర్‌లో అమరావతి బయలుదేరి వెళతారు.

శారదానగర్ డ్రైనేజీ సమస్యకు మోక్షం

... 5వ పేజీ తరువాయి

చేయాలి. టెండర్ పొందిన కాంట్రాక్టర్ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేశారు. డ్రైనేజీ కాలువల నిర్మాణానికి అడ్డుగా వున్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. వీటిని పక్కకు మార్చడానికి ఆర్‌అండ్‌బీ అధికారులు, ఈపీడీసీఎల్‌కు రూ.30 లక్షలు చెల్లించారు. కానీ స్తంభాలు మాత్రమే తొలగించారు. ట్రాన్స్‌ఫార్మర్లను అలాగే వుంచేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ గోడను ఆనుకొని డ్రైనేజీ కాలువ మీద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను డిపో లోపలికి మార్చడానికి అప్పట్లో ఆర్టీసీ అధికారులు అంగీకరించలేదు. దీంతో డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు చేయలేనంటూ కాంట్రాక్టర్ లిఖితపూర్వకంగా ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలియజేసి చేతులెత్తేశారు. బైపాస్ రోడ్డు, డ్రైనేజీ కాలువ పనులకు మొత్తం రూ.4.5 కోట్లు మంజూరు కాగా, కాంట్రాక్టర్ రూ. 3.1 కోట్ల విలువైన పనులు పూర్తి చేశారు. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో అసంపూర్తిగా వున్న డ్రైనేజీ కాలువ పనులు పూర్తిచేయించడానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన డ్రైనేజీ కాలువల గోడలు పూర్తిగా పాడైపోయాయి. దీంతో శారదానగర్ వాసులకు మురుగునీటి సమస్య మరింత అధికమైంది. ఈ నేపథ్యంలో గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ అయ్యన్నపాత్రుడు శారదానగర్ డ్రైనేజీ సమస్యపై దృష్టి సారించారు. ఆయన ఆదేశాలతో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులుకు పంపారు. అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ కాలువ పనులు పూర్తి చేయడానికి, బైపాస్ రోడ్డుపై బీటీ లేయర్ వేయడానికి ప్రభుత్వం రూ.1.85 కోట్లు మంజూరు చేసింది. డ్రైనేజీ కాలువ పనులకు ఎట్టకేలకు మోక్షం కలగడంతో శారదానగర్ కాలనీ వాసులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ హాస్టళ్లకు ర్యాంకులు

... 5వ పేజీ తరువాయి

తక్షణమే సమాచారాన్ని ఇవ్వడానికి మరో ఐదు మార్కులు కేటాయించారు. పరిశుభ్రత, పచ్చదనం, శానిటేషన్ నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనకు మరో ఐదు మార్కులు కేటాయించారు. ఇక ఆరో కేటగిరీలో తప్పక నిర్వహించాల్సిన అంశాలుగా పేర్కొంటూ 30 మార్కులు కేటాయించారు. ఇందులో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహణకు నాలుగు, ఆరోగ్య పరీక్షల నిర్వహణకు నాలుగు, పీ4 ప్రోగ్రామ్‌లో భాగంగా స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాల నిర్వహణ, వనరుల సమీకరణకు మరో నాలుగు మార్కులు, క్రమశిక్షణ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దినందుకు ఆరు, టెక్నాలజీ అప్‌గ్రేడేషన్, ఇన్నోవేషన్‌కు నాలుగు, హాస్టళ్లపై పత్రికల్లో వచ్చే కథనాలకు అధికారుల వివరణకు రెండు మార్కులను కేటాయించారు. ఆరు అంశాల్లో సాధించిన మార్కులను బట్టి హాస్టళ్లకు రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు ప్రకటించనున్నారు.

వసతి గృహాలకు వలంటీర్లు

ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు రాయడం, చదవడం, లెక్కలు చేయడం వంటివి నేర్పించేందుకు వలంటీర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో ప్రీ మెట్రిక్ హాస్టల్‌కు ఒక్కో వలంటీర్‌ను నియమించనున్నారు. రూ.5 వేలు చొప్పున గౌరవ వేతనాన్ని చెల్లించనున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504